# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 1-10-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 56 | పేజీలు:4 | వెల: రూ.1/-


## బీ అలర్ట్ 'షహీన్' తుఫాన్ వచ్చేస్తోంది?.



తెలుగు రాష్ట్రాల్లో విధ్వంసం సృష్టించిన గులాబ్ తుఫాన్ గురించి పూర్తిగా మర్చిపోకముందే మరో తుఫాను విజృంభించడానికి రెడీ అవుతోంది. ఉత్తర అరేబియా సముద్రంలో ఈ తుఫాను ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇవాళే ఈ తుఫాను ఏర్పడుతుందని ఐఎండీ అభిప్రాపయపడుతోంది. దీనికి 'సైక్లోన్ షహీన్ అని పేరు పెట్టారు. ఈ పేరును కతార్ సూచించింది. ఈ తుఫాను భారత్‌పై పెద్దగా ప్రభావం చూపించబోదని పరిశోధకులు చెప్తున్నారు. ఇది పాకిస్థాన్ వైపు వెళ్లనుందని వివరించారు. అయితే భారీ వర్షాల కారణంగా ఉత్తర కొంకణ్, గుజరాత్, కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో 24 గంటలపాటు రెడ్ అలర్ట్ విధించారు.

# రాష్ట్రంలో తైవాన్ పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , సెప్టెంబర్ 30:తైవాన్ పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఇన్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తైవాన్ ? కనెక్ట్ తెలంగాణ స్టేట్ సమావేశంలో మంత్రి కేటీఆర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. తైవాన్ ? తెలంగాణ మధ్య వ్యాపార వాణిజ్యాన్ని మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో పెట్టుబడి అవకాశాలను కంపెనీలకు అవగాహన కల్పించే నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం తైవాన్ పెట్టుబడులకు ఆది నుంచి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా తెలంగాణ ? తైవాన్ మధ్య అద్భుతమైన భాగస్వామ్యం ఉందన్నారు. తైవాన్ పెట్టుబడుల కోసం గతంలో ఆ దేశంలో పర్యటించిన విషయాన్ని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు.

తైవాన్ దేశానికి సంబంధించిన టీసీఏతో టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఇండియన్ తైవాన్ స్టార్టప్ అలయన్స్‌ని ఏర్పాటు చేసుకున్న ఏకైక భారత సిటీగా హైదరాబాద్ ఉందని కేటీఆర్ అన్నారు. తైవాన్ పారిశ్రామిక సంస్కృతి నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. ఈ దిశగా అక్కడి పారిశ్రామిక వర్గాలతో మరింత భాగస్వామ్యం కోసం ప్రయత్నం చేస్తామని కేటీఆర్ అన్నారు. 2020వ సంవత్సరం నుంచి వ్యాపార వాణిజ్య పరిస్థితులకు కరోనా సంక్షోభం సవాళ్లను విసిరిందని, అయితే ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరింత వేగంగా కొనసాగుతుందన్న విశ్వాసాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు.

### 32 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గత ఐదు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని కేటీఆర్ క్లుప్తంగా వివరించారు. ఇప్పటికే రాష్ట్రం సుమారు 32 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించిందని, తెలంగాణ జీడీపీ, తలసరి ఆదాయం పెరుగుతూ వస్తోందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో తెలంగాణ ప్రతిసారి అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఐటీ, ఐటీ అనుబంధ రంగాల్లో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ వస్తుందన్నారు.

### తైవాన్‌తో బలమైన భాగస్వామ్యం!

అయితే తమ రాష్ట్రం ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, పరిశోధన అభివృద్ధి రంగాల్లో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తుందని, ఈ దిశగా తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజాలను తెలంగాణలోకి ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంటామని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం తైవాన్‌కి చెందిన ప్రముఖ కంపెనీలు తెలంగాణలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్ వంటి రంగాలకు మరింత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్ మరియు దాని అనుబంధ రంగాల్లో తైవాన్ తో బలమైన భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు కృషి చేద్దామని కేటీఆర్ కోరారు.

### తెలంగాణ పాలసీలపై ఇన్వెస్ట్ ఇండియా సీఈవో ప్రశంసలు

ఈ సందర్భంగా మాట్లాడిన ఇన్వెస్ట్ ఇండియా సీఈవో దీపక్ బగ్లా తెలంగాణ రాష్ట్ర పాలసీలు, రాష్ట్రం సాధిస్తున్న పురోగతి పైన ప్రశంసలు కురిపించారు. ఇన్వెస్ట్ ఇండియా తరపున తెలంగాణతో కలిసి పనిచేయడం ఎల్లప్పుడూ తమకు అత్యంత ప్రోత్సాహం ఇస్తుందని ఈ సందర్భంగా అన్నారు.

### తైవాన్ దేశానికి తెలంగాణ సహజ భాగస్వామి

అనంతరం టైట్రా చైర్మన్ జేమ్స్ ఎఫ్ హువంగ్ మాట్లాడుతూ.. తెలంగాణ తైవాన్ దేశానికి సహజ భాగస్వామి అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి తాము అద్భుతమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే తైవాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీలు తెలంగాణతో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని, రానున్న రోజుల్లో ఎలక్ట్రానిక్స్ మరియు ఎలక్ట్రానిక్స్ అనుబంధ రంగాల్లో ఈ భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ దిశగా ఈ రోజు ఇన్వెస్ట్ ఇండియా ఏర్పాటు చేసిన సమావేశం ఉపయుక్తంగా ఉంటుందని ఆశించారు. ఈ సమావేశంలో మంత్రి కేటీఆర్‌తో పాటు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టీ ఫైబర్ సీఈవో సుజయ్ కారంపూరి పాల్గొన్నారు.

# ఈటల కుట్రలను తిప్పికొట్టాలి: ప్రభుత్వ విప్ బాల్క సుమన్

హైదరాబాద్ , సెప్టెంబర్ 30: ఈటల రాజేందర్ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పిలుపునిచ్చారు. సానుభూతి పొందేలా ఈటల డ్రామాలు చేసే అవకాశం ఉందని చెప్పారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్‌లో జరిగిన వికలాంగుల ఆత్మీయ సమ్మేళనంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ.. గత పాలకులు దివ్యాంగుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ పాలనలో దివ్యాంగులందరికి పెన్షన్ అందుతున్నదని చెప్పారు.

దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో రూ.3016 పెన్షన్ అందుతున్నదా అని ప్రశ్నించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ వాహనాలను అందిస్తున్నామని చెప్పారు. గెల్ల శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

వికలాంగుల సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వాసుదేవరెడ్డి అన్నారు. వికలాంగులకు రూ.3016 పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు.

# రాష్ట్రంలో 20 మంది డీఎస్పీలకు స్థానచలనం

హైదరాబాద్ , సెప్టెంబర్ 30: రాష్ట్రంలో భారీగా పోలీసు అధికారుల బదిలీలు జరిగాయి. ఖమ్మం రూరల్, గోదావరిఖని ఏసీపీలతోసహా 20 డీఎస్పీలను ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు డీజీపీ మహేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

ఏసీబీ డీఎస్పీ వంగా రవిందర్ రెడ్డి మెట్‌పల్లి ఎస్డీపీవోగా బదిలీ అయ్యారు. అక్కడ ఉన్న ఎండీ గౌస్ బాబాను మెట్‌పల్లి ఎస్డీపీవోగా బదిలీ చేశారు.

ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ డీ రఘుచందర్‌ను స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీగా, డీఎస్పీ పీ సదయ్యను మహబూబాబాద్ ఎస్డీపీవోగా, ఎన్ గిరి ప్రసాద్‌ను గోదావరిఖని ఏసీపీగా నియమించారు.

గోదావరిఖని ఏసీపీ వీ ఉమేందర్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీ జీ బస్వా రెడ్డి ఖమ్మం రూరల్ ఏసీపీగా, అక్కడ ఉన్న ఎస్ వెంకట్ రెడ్డిని హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

వెయింటింగ్‌లో ఉన్న బీవీ సత్యనారాయణను వికారాబాద్ ఎస్డీపీవోగా, అక్కడ ఉన్న ఏ సంజీవరావు హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న జీ కృష్ణను జనగాం ఏసీపీగా నియమించగా, అక్కడ ఉన్న ఎస్ వినోద్ కుమార్‌ను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

వెయిటింగ్‌లో ఉన్న ఏ మహేశ్‌ను బెల్లంపల్లి ఏసీపీగా నియమించగా, అక్కడ ఉన్న ఎంఏ రహమాన్‌ను చీఫ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. మహబూబ్‌నగర్‌లో వెయిటింగ్‌లో ఉన్న బీ కృష్ణను మహబూబ్‌నగర్ ఎస్డీపీవోగా నియమించగా, అక్కడ ఉన్న జీ శ్రీధర్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

వరంగల్ డీఎస్పీ ఎన్ సుధీర్‌ను హైదరాబాద్‌లోని గోపాలపురం ఏసీపీగా నియమించగా, అక్కడ ఉన్న పీ వెంకటరమణను చీఫ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో పోస్టింగ్ కోసం వేచిఉన్న బీ గంగాధర్‌ను రాజేంద్రనగర్ ఏసీపీగా నియమించగా, అక్కడ ఉన్న ఆర్ సంజయ్ కుమార్‌ను చీఫ్ ఆఫీస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

# ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉండాలి: ప్రధాని మోదీ




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల లేదా ఒక పీజీ మెడికల్ ఇన్‌స్టిట్యూషన్ ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజస్థాన్‌లో ఇవాళ నాలుగు వైద్య కళాశాలకు మోదీ శంకుస్థాపన చేశారు. బన్‌స్వారా, సిరోహి, హనుమాన్‌ఘర్, దౌసా జిల్లాల్లో కొత్త మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆరోగ్య సంరక్షణా చర్యలపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. జైపూర్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ టెక్నాలజీ కాలేజీకి కూడా మోదీ శంకుస్థాపన చేశారు.

ఇటీవల ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆరోగ్య సేవలను ప్రారంభించామని, ఆ సేవలను దేశమంతా విస్తరించామన్నారు. హాస్పిటళ్లు, ల్యాబ్‌లు, ఫార్మసీలన్నింటినీ ఒక క్లిక్‌తో విజిట్ చేయవచ్చు అని తెలిపారు. డిజిటల్ హెల్త్ మిషన్‌తో రోగుల మెడికల్ డాక్యుమెంట్లు సురక్షితంగా ఉంచవచ్చు అని ప్రధాని తెలిపారు. దేశంలోని ఆరోగ్య రంగాన్ని మార్చేందుకు జాతీయ ఆరోగ్య విధానాన్ని అవలంబిస్తున్నట్లు ఆయన చెప్పారు. కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలకు ఆరోగ్య రంగ అవసరాలను గుర్తు చేసిందన్నారు. ప్రతి దేశం ఆ సంక్షోభాన్ని తమదైన రీతిలో ఎదుర్కొన్నట్లు చెప్పారు. మహమ్మారి వేళ భారత తన శక్తిని, ఆత్మరక్షణను పెంచుకుందన్నారు.

రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. తనపై నమ్మకం ఉంచినందుకు థ్యాంక్స్ చెబుతున్నానని అన్నారు. ఇద్దరమూ భిన్నమైన పార్టీలకు చెందినవాళ్లమని, ఐడియాలజీలు భిన్నమైనవని, కానీ ప్రజాస్వామ్యంలో ఉన్న శక్తి ఇదే అని మోదీ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సీఎం గెహ్లాట్ కోరిన నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ రకంగా రియాక్ట్ అయ్యారు.

# అత్యాచార ఘటనలో ఆరుగురు నిందితుల అరెస్ట్

నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలో బుధవారం వెలుగుచూసిన అత్యాచార ఘటనలో ఆరుగురు నిందితులను నిజామాబాద్ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే ప్రధాన నిందితుడు విజయ్‌తో పాటు భాను ప్రకాష్, కరీం, చంద్రశేఖర్, గంగాధర్, చరణ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లుగా సీపీ కార్తికేయ చెప్పారు.

నిందితులపై అత్యాచార కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీపీ వెల్లడించారు. బాధిత యువతికి స్నేహితుడు విజయ్ మొదటగా లోబర్చుకొని మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకు వచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. అనంతరం విజయ్ తన స్నేహితులకు సమాచారం అందించడంతో మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసుల విచారణలో వివరాలు వెల్లడించినట్లు సీపీ పేర్కొన్నారు.

బాధిత యువతిని మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి కలవడానికి ప్రయత్నించగా..పోలీసులు అడ్డుకున్నారన్న ఆరోపణలను పోలీసులు ఖండించారు. బాధిత యువతి తో నిజామాబాద్ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు అసభ్యకంగా ప్రవర్తించారన్న విషయంపై స్పందించేందుకు పోలీసులు నిరాకరించారు. అలాంటి ఘటన జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు.



# తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ కుట్ర.. డీపీఆర్‌లు ఆమోదించొద్దని కేంద్రానికి లేఖ

హైదరాబాద్ , సెప్టెంబర్ 30: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కుట్ర పూరిత వ్యవహార శైలికి ఈ లేఖ ఒక నిదర్శనం. సీడబ్ల్యూసీకి సమర్పించిన తెలంగాణ ప్రాజెక్టుల డీపీఆర్‌లను ఆమోదించొద్దని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 29న ఓ లేఖ రాసింది. గోదావరి పరీవాహక ప్రాంతంలో తెలంగాణ 79 శాతం వాటా కలిగి ఉన్నది.

గోదావరిలో ఉత్పత్తి అయ్యే 1480 టీఎంసీల నికర జలాల్లో తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన నీరు 967.94 టీఎంసీలు అని సాక్షాత్తు ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ముసాయిదా విభజన బిల్లు చర్చ సందర్భంగా శాసన సభ్యులకు అధికారికంగా సమాచారాన్ని అందజేశారు. అయినా ఇవాళ ఈ లేఖలో తొండి వాదాన్ని లేవనెత్తుతూ ఆంధ్రప్రదేశ్ వాటా 776 టీఎంసీలు, తెలంగాణ వాటా 650 టీఎంసీలు అని తప్పుడు సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్నది.

# డెంగ్యూ వ్యాక్సిన్ కోసం ట్రయల్స్ నిర్వహిస్తున్నాం: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:డెంగ్యూ వ్యాక్సిన్‌కు సంబంధించి మరింత విస్తృతంగా ట్రయల్స్ నిర్వహించనున్నట్లు ఐసీఎంఆర్ డైరక్టర్ జనరల్ డాక్టర్ బల్‌రామ్ భార్గవ్ తెలిపారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాక్సిన్ చాలా ముఖ్యమైందని, కొన్ని డెంగ్యూ స్ట్రెయిన్లపై ప్రస్తుతం ఇండియాలో అధ్యయనం సాగుతోందని, అయితే ఆ కంపెనీలు చాలా వరకు విదేశాల్లో తొలి దశ ట్రయల్స్ చేశాయని, ఇండియాలో ఎక్కువ స్థాయిలో ట్రయల్స్ నిర్వహించాలని భావిస్తున్నట్లు ఐసీఎంఆర్ చీఫ్ తెలిపారు.

ఇక కోవాగ్జిన్‌కు డబ్ల్యూహెచ్‌వో అనుమతి గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు కోవాగ్జిన్ డేటాను పూర్తిగా సమర్పించినట్లు తెలిపారు. ఆ డేటాను డబ్ల్యూహెచ్‌వో పరిశీలిస్తోందన్నారు. త్వరలోనే కోవాగ్జిన్‌కు ఎమర్జెన్సీ అనుమతిపై డబ్ల్యూహెచ్‌వో నిర్ణయం తీసుకుంటుందని డాక్టర్ బల్‌రామ్ భార్గవ్ తెలిపారు. దేశంలోని ప్రజలందరికీ రెండు డోసుల టీకా ఇవ్వడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రస్తుత దశలో బూస్టర్ డోసు గురించి ఆలోచించడం లేదని ఆయన తెలిపారు.

పండుగ సీజన్ సమీపించిందని, ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటించాలని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషన్ తెలిపారు. సామాజిక దూరాన్ని పాటించాలన్నారు. మాస్క్‌లను తప్పనిసరిగా ధరించాలన్నారు. కోవిడ్ ప్రవర్తనానియమావళి ప్రకారం పండుగలను సెలబ్రేట్ చేసుకోవాలని సూచించారు. కేరళలో అత్యధికంగా కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నట్లు చెప్పారు. దేశంలో ఉన్న కేసుల్లో 52 శాతం యాక్టివ్ కేసులు ఆ రాష్ట్రంలో ఉన్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, తమిళనాడు, మిజోరం, కర్నాటక, ఏపీల్లో అధిక కేసులు నమోదు అవుతున్నాయని రాజేశ్ తెలిపారు.

# నిజామాబాద్ ఘటన బాధాకరం : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ , సెప్టెంబర్ 30: నిజామాబాద్ నగరంలో మహిళపై జరిగిన అత్యాచార ఘటన చాలా బాధాకరమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఘటనలను ఏమాత్రం ఉపేక్షిందన్నారు. 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేసిన పోలీస్ శాఖకు కవిత అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్ అన్ని జిల్లాల్లో షీ టీంలను ఏర్పాటు చేసి, ఆడబిడ్డలకు భరోసానిస్తున్నారని తెలిపారు. మహిళలపై వివక్ష చూపినా, అఘాయిత్యాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం వెనకడుగు వేయదన్నారు. బాధితురాలికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున, వ్యక్తిగతంగానూ అన్ని రకాలుగా అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

# టీఆర్ఎస్ వెంటే మైనార్టీలు : ఎమ్మెల్యే బాల్క సుమన్

హుజూరాబాద్, సెప్టెంబర్ 30:: టీఆర్ఎస్ వెంటే మైనార్టీ సోదరులు ఉన్నారని ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ చెప్పారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కమలాపురం మండలంలోని ఉప్పల్ గ్రామ మైనార్టీ సోదరులు తీర్మానించుకున్నారు. ఈ మేరకు తీర్మాన కాపీని ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు అందజేశారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన ముస్లిం సోదరులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి టీఆర్ఎస్ కట్టుబడి ఉందని, కేసీఆర్ పాలనలోనే ముస్లిం సోదరులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. వచ్చే ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు.

# అతిత్వరలో పిల్లలకు కొవిడ్ టీకా!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలో త్వరలోనే 12 ఏళ్లుపైబడిన పిల్లలకు కొవిడ్ టీకా వేయనున్నారు. జైడస్ క్యాడిలా రూపొందించిన టీకాను జాతీయ కొవిడ్ టీకా డ్రైవ్‌లోకి ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. ధర ఇంకా నిర్ణయించలేదని, మూడు డోసుల టీకా కావడంతో భిన్నంగా ఉంటుందని పేర్కొంది.

12 ఏళ్లు పైబడిన పిల్లలతో పాటు పెద్దల కోసం జైడస్ క్యాడిలా జైకోవ్-డీ పేరుతో వ్యాక్సిన్ తయారు చేసింది. ఇప్పటికే డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా గత నెల 20న అత్యవసర వినియోగానికి అనుమతి ఇచ్చింది.

గురువారం ఆరోగ్యమంత్రిత్వ శాఖ బ్రీఫింగ్‌లో హెల్త్ సెక్రెటరీ రాజేశ్ భూషణ్ మాట్లాడుతూ జైడస్ వ్యాక్సిన్‌ను అతిత్వరలో జాతీయ టీకా డ్రైవ్‌లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

ఇంకా తేదీ నిర్ణయించలేదని, మూడు డోసుల టీకా కావడంతో ధర ఇతర టీకాలకంటే భిన్నంగా ఉంటుందని వివరించారు. గతవారం నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డాక్టర్ వీకే పాల్ సైతం జైడస్ టీకా డ్రైవ్‌లోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు.

జైకోవ్ ప్రపంచంలోనే తొలి డీఎన్‌ఏ ఆధారంగా రూపొందించిన మొదటి టీకా. కేంద్రానికి చెందిన బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ) 'మిషన్ కొవిడ్ సురక్ష' కింద జైడస్ క్యాడిలాతో కలిసి టీకాను అభివృద్ధి చేసింది. సూది వినియోగించకుండానే ఫార్మజెట్ అనే సాధనం ద్వారా చర్మంలోకి వ్యాక్సిన్‌ను ప్రవేశపెట్టనున్నారు.







# స్వచ్ఛంధ రక్తదానమే యువత లక్ష్యం కావాలి

## (01 అక్టోబర్ 'జాతీయ స్వచ్ఛంధ రక్తదాన దినం' సందర్భంగా)

డా: జై గోపాల్ జోలీ నేతృత్వంలో ఏర్పడిన 'బ్లడ్ బ్యాంక్ సెసైటీ'తో పాటు 'ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యునోహెమటాలజీ' స్థాపించి 'ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్‌లో అపార సేవలు అందించారు. డా: జై గోపాల్ జోలీ జన్మదినాన్ని పురస్కరించుకొని 01 అక్టోబర్ 1975న ప్రారంభమైన 'జాతీయ స్వచ్ఛంధ రక్త దాన దినం' వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం. జై గోపాల్ జోలీ సేవను గుర్తించిన వైద్య సమాజం వారిని 'భారత మార్పిడి వైద్యశాస్త్ర పితామహుడి(ఫాదర్ ఆఫ్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ ఇన్ ఇండియా'గా పిలుస్తున్నారు. ప్రమాదం లేదా పలు వ్యాధితో బాధ పడుతున్న రోగుల ప్రాణాలు నిలుపడానికి అవసరమైన రక్తం దాతల నుంచి పూర్తిగా అందడం లేదు. దేశంలో సరిపోయే రక్తనిధి కేంద్రాలు కూడా అందుబాటులో లేవు. ఆరోగ్యవంతులు రక్తదాన సేవ పట్ల అపోహలను తొలగించుకొని, తరుచుగా కనీసం ఏడాదికి 2-3 సార్లు అయినా స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ఉత్సుకత చూపడానికి ప్రేరణను కలిగించడానికి 01 అక్టోబర్ వేదికను ఉపయోగిస్తారు.

గత వివరాల ప్రకారం భారత దేశంలో 12 మిలియన్ యూనిట్ల రక్తం అవసరం ఉండగా, 10.9 మిలియన్ యూనిట్లు మాత్రమే దాతల నుండి లభ్యం అవుతున్నందున 1.1 మిలియన్ యూనిట్ల కొరత ఏర్పడుతోంది. అనేక అభాగ్యులకు సమయానికి రక్తం అందక అనేక నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నారు. 18-60 ఏండ్లు దాతలు కనీస బరువు 45 కేజీల కన్న అధికంగా ఉన్న ఆరోగ్యవంతుల నుంచి 3 మాసాలకు ఒకసారి 350 యంయల్ వరకు రక్తం సేకరించవచ్చు. స్వచ్ఛంధ రక్త దాత రక్తంలో 12.5 గ్రామ్స్/డియల్ హిమోగ్లోబిన్, రేబిస్/కాన్సర్/బిపి/షుగర్/టిబి/హెచ్ఐవి-ఏయిడ్స్/సుఖవ్యాధులు వంటి రుగ్మతలు ఉండరాదు. ఆధునిక ప్రజారోగ్య వ్యవస్థలో స్వచ్ఛంధ రక్తదాతల అవసరం ఎంతగానో ఉంది. ఒకరి జీవితాన్ని కాపాడగలిగిన రక్తం, ప్లాస్మా, ప్లేట్‌లెట్లను దానం చేయడమనేది అతి ముఖ్యమైన సేవగా గుర్తించబడింది. మన సమీప బంధువుల అవసరానికి కాకుండా విశ్వమానవాళి ప్రాణాలు నిలుపడానికి రక్తదానయజ్ఞం మన జీవితంలో అంతర్భాగం కావాలి.

మనం దానం చేసిన రక్తాన్ని అవసరార్థులకు ఇవ్వడానికి ముందు ఏయిడ్స్, హెపటైటిస్-బి/సి, మలేరియా, యస్‌టిడి, కోవిడ్-19, బ్లడ్ గ్రూపులు (ఏ,బి,ఏబి, ఓ) లాంటి పలు రక్త నాణ్యత పరీక్షలు చేస్తారు. రక్తదానం వ్యాపారం కారాదు. ధనాన్ని ఆశించి రక్తదానం చేయడమే వృత్తిగా తీసుకోవడం, అలాంటి దాతలను ప్రోత్సహించడం ప్రమాదకరం. స్వచ్ఛంధ రక్తదాన సేవల పట్ల యువతలో అవగాహన కల్పించడం, అనుమానాలను (రక్తహీనత కలుగుతుందని, సూదులకు భయపడడం, నొప్పికి భయపడడం, బలహీనం అవుతామని) నివృత్తి చేయడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, అత్యవసర సమయాల్లో రోగులకు ప్రత్యక్షంగా దానం చేయడం లాంటి అంశాలను చేపట్టాలి. గుండె పంపింగ్ ద్వారా రక్తం నాళాల్లోంచి శరీరంలోని అన్ని కణజాలాలకు ఆక్సీజన్, పోషకాలను అందించడమే కాకుండా శరీరం నుంచి వ్యర్థాలను విసర్జించడాన్ని దేహదపడుతుంది. రోడ్డు ప్రమాదాలు, ప్రసవ సంక్లిష్టాలు, తీవ్ర రోగాలు, హింసాత్మక ఘటనలు లాంటి జరిగినపుడు సత్వరమే దాతల నుంచి రక్తం అవసరం అవుతుంది. మనందరం కనీసం మన పుట్టిన రోజు, పెళ్ళి రోజుల్లో లేదా ఇతర ముఖ్య తేదీల్లో ఏడాది ఒకసారైన రక్తదానం చేయడానికి ప్రతిన బూనాలి. మన దేశంలో త్రిపుర రాష్ట్రంలో అత్యధిక స్వచ్ఛంధ రక్తదాతలు, మణిపూర్‌లో అత్యల్ప దాతలు ఉన్నారు.

రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్స్, రోటరీ క్లబ్స్, యన్‌యస్‌యస్, యన్‌సిసి, పలు స్వచ్ఛంధ సంస్థలు, యువజన సంఘాలు, కళాశాలలు, యువ సంస్థల్లో విధిగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, స్వచ్ఛంధ రక్తదాతల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలి. పవిత్ర నిస్వార్థ ఆదర్శ సేవగా స్వచ్ఛంధ రక్తదానం పేరు గడించింది. ఆరోగ్యవంతుల శరీరంలో 4-5 లీటర్ల రక్తం ఉంటుంది. రక్తదానంలో డిస్పోజబుల్ నీడిల్స్ వాడడం జరుగుతుందని తెలుసుకోవాలి. ప్లాస్మా దానాన్ని 'ది గిఫ్ట్ ఆఫ్ లైఫ్'గా అభివర్ణిస్తున్నారు. రక్తంలోని పసుపు వర్ణపు ద్రవాన్ని ప్లాస్మాగా పిలుస్తూ, బలహీన రోగనిరోధకశక్తి ఉన్న రోగులకు అందిస్తారు. కోవిడ్-19 రోగులు, తీవ్ర ట్రామా, కాలిన గాయాలు, రక్తం గట్టని సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ప్లాస్మా అందిస్తారు. ప్లేట్లెట్ కణాలు రక్తం గడ్డకట్టడానికి, రక్తస్రావం ఆపడానికి ఉపయోగ పడుతుంది. ల్యుకేమియా, కీమోథెరపీ, డెంగ్యూ లాంటి అవునారోగ్యాలకు అత్యవసరంగా ప్లేట్లెట్స్ అవసరం అవుతాయి.

ఇండియాలో రక్తం, రక్త ఉత్పత్తుల కొరత అధికంగా ఉన్నందున యువభారతం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త కొరతను రూపుమాపాలి, రక్త కొరత వల్ల జరిగే మరణాలను పూర్తిగా అరికట్టాలి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఎగుమతుల ప్రోత్సాహానికి భారీ చర్యలు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:ఎగుమతి రంగానికి ఊతం ఇచ్చే అనేక చర్యలను నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా, జాతీయ ఎగుమతి బీమా ఖాతా (ఎన్.ఇ.ఐ.ఎ.) గ్రాంట్ ఇన్ ఎయిడ్ కార్పస్ నిధిగా ఐదేళ్లపాటు రూ. 1,650కోట్ల రూపాయలను అందించే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. 2021-22వ ఆర్థిక సంవత్సరం నుంచి 2025-26వ సంవత్సరం వరకూ ఈ నిధిని అందిస్తారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన కీలకమైన ఎగుమతులకు తగిన ప్రోత్సాహం అందించే లక్ష్యంతో ఎ.ఇ.ఐ.ఎ. ట్రస్టును 2006లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎన్.ఇ.ఐ.ఎ. ట్రస్టు అనేది మధ్య కాలిక, దీర్ఘకాలిక ఇంజినీరింగ్ పరికకరాల ఎగుమతులను (ప్రాజెక్ట్ ఎగుమతులను) ప్రోత్సహిస్తుంది. భారతీయ ఎగుమతి రుణ హామీ సంస్థ (ఇ.సి.జి.సి.) జారీ చేసిన ఆదేశాల పరిధి లోని ప్రాజెక్టు ఎగుమతులకు ఎన్.ఇ.ఐ.ఎ. ట్రస్టు మద్దతు ఇస్తుంది. మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రాజెక్టు ఎగుమతికి, అలాగే విక్రయదార్ల రుణానికి సంబంధించి ఎగుమతి దిగుమతి (ఎగ్జిమ్) బ్యాంకుకు కూడా ఈ ట్రస్టు సహాయ సహకారాలు అందిస్తుంది.ఎన్.ఇ.ఐ.ఎ. ట్రస్టుకు పెట్టుబడి మూల ధనాన్ని అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం,.. భారతీయ ప్రాజెక్టు ఎగుమతిదార్లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీనితో మార్కెట్లో భారీ స్థాయిలో ప్రాజెక్టు ఎగుమతులకు అవకాశం ఏర్పడుతుంది. భారతదేశంలోని పలు ప్రాంతాలనుంచి ప్రాజెక్టు ఎగుమతులకు మద్దతు లభించడంతో దేశంలో తయారీ రంగం విస్తృతం కావడానికి అవకాశం ఏర్పడుతుంది. రూ. 1,650కోట్ల మేర కార్పస్ నిధిని అందించడంతో ఎన్.ఇ.ఐ.ఎ. ట్రస్టుకు ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగిపోతాయి. పూర్తిస్థాయిలో సామర్థ్యాల వినియోగంతో రూ. 33,000కోట్ల మేర విలువైన ప్రాజెక్టు ఎగుమతులకు ఎన్.ఇ.ఐ.ఎ. సహాయం అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. దీనితో స్వదేశీ తయారీ సరకుల ఉత్పాదన కూడా దాదాపు రూ. 25,000కోట్ల వరకూ పెరుగుతుంది.

దీనికి తోడు, ప్రాజెక్టుల్లో 75శాతం వరకూ స్వదేశీయత కనిపిస్తుంది. 12,000మంది సిబ్బంది బ్యాంకింగ్, కార్పొరేట్ సంస్థలు వంటి ఫార్మల్ రంగానికి మళ్లే అవకాశాలు ఉన్నాయని ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ.) 'ఎక్స్.పోర్ట్స్ టు జాబ్స్' పేరిట వెలువరించిన నివేదిక అంచనా వేస్తోంది. ఈ నివేదిక వెలువరించిన అంచనాల ఆధారంగా, ఫార్మల్ రంగంలోను, ఇతర రంగాల్లోను మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.6లక్షల మేర పెరగవచ్చని భావిస్తున్నారు.

# ఇనీశియల్పబ్లిక్ ఆఫర్ మాధ్యమం ద్వారా ఎక్స్ పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:నమోదు కానటువంటి సిపిఎస్ఇ గా ఉన్న మెసర్స్ ఎక్స్ పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఇసిజిసి) సెబి యొక్క (మూలధనం జారీ మరియు వెల్లడి ఆవశ్యకతలు సంబంధి) నిబంధన లు, 2018 పరిధి లో ఇనీశియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) మాధ్యమం ద్వారా స్టాక్ ఎక్స్చేంజ్ లో నమోదు చేయడానికి గౌరవనీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన గల ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఆమోదం తెలిపింది.

ఎగుమతుల కు క్రెడిట్ రిస్క్ ఇన్ శువరన్స్ మరియు సంబంధి సేవల ను అందించి ఎగుమతుల యొక్క పోటీతత్వాన్ని మెరుగు పరచాలి అనే ఉద్దేశ్యం తో ఏర్పాటు చేసిన ఇసిజిసి లిమిటెడ్ భారత ప్రభుత్వ సంపూర్ణ యాజమాన్యం లో ఉన్నటువంటి ఒక సిపిఎస్ఇ . ఈ కంపెనీ తన మేక్సిమమ్ లయబిలిటీస్ (ఎమ్ఎల్) ను ఇప్పుడున్న 1.0 లక్ష కోట్ల రూపాయల స్థాయి నుంచి పెంచుకొని, 2025-26 కల్లా 2.03 లక్షల కోట్ల రూపాయలు గా చేసుకోవాలని లక్ష్యం గా పెట్టుకొన్నది.

ఇసిజిసి లిమిటెడ్ (స్టాక్ ఎక్స్చేంజ్ లో) నమోదు కావడం వల్ల, కంపెనీ తాలూకు వాస్తవిక విలువ వెలుగు లోకి వస్తుంది. అంతేకాకుండా, కంపెనీ యొక్క ఎక్విటి హోల్డింగ్ లో సార్వజనిక భాగస్వామ్యానికి ప్రోత్సాహాన్ని ఇవ్వడం వల్ల 'మంది కి యజమానత్వా'న్ని కట్టబెట్టేందుకు కూడా ఊతం లభిస్తుంది. అలాగే పారదర్శకత్వం, జవాబుదారుతనం మరింత గా పెరగడం వల్ల కార్పరిట్ గవర్నన్స్ ను సైతం ప్రోత్సహించినట్లు అవుతుంది.

లిస్టింగ్ ప్రక్రియ తో ఇసిజిసి కి మార్కెటు నుంచి, లేదా అదే ఐపిఒ మాధ్యమం ద్వారా, లేదా అటు తరువాత ఫాలో-ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్ పిఒ) మాధ్యమం ద్వారా తాజా గా మూలధనాన్ని పోగేసుకోవడానికి మార్గం సుగమం అయ్యే ఆస్కారం ఉంది. తత్ఫలితం గా మేక్సిమమ్ లయబిలిటీ ని పెంచుకోవడం లో కూడాను కంపెనీ కి తోడ్పాటు అందగలదు.

డిసిన్వెస్ట్ మెంట్ వల్ల ప్రాప్తించే రాశి ని సామాజిక రంగం లోని పథకాల కు ఆర్థిక సహాయం చేయడం కోసం వినియోగించడం జరుగుతుంది.

# రాజ్ కోట్-కనాలూస్ రైలు మార్గం డబ్లింగ్‌కు ఆమోదం తెలిపిన మంత్రి మండలి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:ంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల పై ఏర్పాటైన మంత్రివర్గ సంఘం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం 1,080.58 కోట్ల రూపాయలు గా ఉండవచ్చు. అంతేకాకుండా, దీని మొత్తం వ్యయం 1,168.13 కోట్ల రూపాయల కు పెరిగే ఆస్కారం ఉంది. ఈ మార్గం డబ్లింగ్ మొత్తం 111.20 కి.మీ పొడవు తో ఉంటుంది. నాలుగు సంవత్సరాల లోపల ఈ ప్రాజెక్టు ను పూర్తి చేయడం జరుగుతుంది.

ఈ సెక్షను లో ప్రస్తుతం జరుగుతున్న సరకుల రవాణా లో ఆహార ధాన్యాలు, ఎరువులు, సిమెంటు, బొగ్గు, ఇంకా పిఒఎల్ ఉన్నాయి. ఈ సరకుల ను ఈ ప్రాజెక్టు మార్గాన్ని ఆనుకొని ఉన్న పరిశ్రమల నుంచి తీసుకొని వెళ్లడం జరుగుతుంది. రిలయన్స్ పెట్రోలియమ్, ఎస్సార్ ఆయిల్, టాటా కెమికల్ వంటి పెద్ద పరిశ్రమల నుంచి భవిష్యత్తు లో గణనీయమైన స్థాయి లో సరకుల చేరవేత కు అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. రాజ్ కోట్- కనాలూస్ మధ్య ఒకే మార్గం తో కూడిన బ్రాడ్ గేజ్ సెక్షన్ లో సామర్థ్యాని కి మించి రాకపోకలు జరిగాయి. దీనికి కార్యకలాపాల లో ఒత్తిడి ని తగ్గించడం కోసం ఒక సమాంతర బిజి లైను ను అదనం గా సమకూర్చవలసిన అవసరం ఉంది. ఈ సెక్షన్ లో ప్రయాణికుల రైళ్ళ /మెయిల్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లు 30 జతలు రాకపోకలు జరుపుతున్నాయి. ఈ మార్గం లో డబ్లింగ్ అనంతరం ప్రయాణికుల కు రాకపోకల తో పాటుగా, సరకు రవాణా తాలూకు ఒత్తిడి చెప్పుకోదగిన స్థాయి లో సడలిపోతుంది. ఈ సెక్షన్ లో రెండు మార్గాల ను అందుబాటులోకి తీసుకు వచ్చిన అనంతరం వ్యవస్థ లోకి మరిన్ని రైళ్ళ రాకపోక లను మొదలు పెట్టవచ్చును. రాజ్ కోట్ నుంచి కనాలూస్ వరకు రైలు మార్గాన్ని డబ్లింగ్ చేసినందువల్ల అది సౌరాష్ట్ర ప్రాంతం సర్వతోముఖ అభివృద్ధి కి దారి తీయగలుగుతుంది.

# నీమచ్-రత్లామ్ రైల్ వే లైను డబ్లింగుకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:నీమచ్-రత్ లామ్ రైల్ వే లైను డబ్లింగ్ పనుల కు మాననీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఆమోదాన్ని తెలియజేసింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం 1,095.88 కోట్ల రూపాయలు గా ఉండవచ్చు. పనులు పూర్తి అయ్యే సరికి దీని వ్యయం పెరిగి 1,184.67 కోట్ల రూపాయల కు చేరుకొనేందుకు ఆస్కారం ఉంది. ఈ లైను డబ్లింగ్ తాలూకు మొత్తం పొడవు 132.92 కిలోమీటర్ లు. ఈ ప్రాజెక్టు నాలుగు సంవత్సరాల లో పూర్తి కావచ్చని భావిస్తున్నారు.

మెంటనన్స్ బ్లాకుల తో కలుపుకొంటే నీమచ్-రత్ లామ్ సెక్షన్ తాలూకు లైను సామర్థ్య వినియోగం 145.6 శాతం వరకు ఉంది. ఈ ప్రాజెక్టు లైన్ సెక్షను లో మెంటనన్స్ బ్లాకు ఏర్పాటు చేయకపోయినప్పటికీ ఈ మార్గం గుండా అభిలషణీయమైన స్థాయి కి మించిన సరకు రవాణా రాక పోక లు జరిగాయి. సిమెంటు కంపెనీ లు వాటి స్వీయ అవసరాల కోసం ఏర్పాటు చేసుకొన్న పవర్ ప్లాంటు లకు అవసరపడ్డ బొగ్గు ను ఈ మార్గం ద్వారా ప్రధానం గా చేరవేయడం జరిగింది. నీమచ్-చిత్తౌడ్ గఢ్ ప్రాంతం లో సిమెంటు గ్రేడు సున్నపు రాయి తాలూకు భారీ నిక్షేపాలు అందుబాటు లోకి రావడం తో కొత్త గా సిమెంటు పరిశ్రమలను ఏర్పాటు అవుతున్న కారణం గా ఈ సెక్షన్ లో సరకు రాకపోకలు మరింత గా పెరుగనున్నాయి.

నీమచ్-రత్ లామ్ సెక్షన్ డబ్లింగు తో ఈ సెక్షన్ సామర్థ్యం హెచ్చనుంది. ఈ విధం గా వ్యవస్థ లోకి మరిన్ని సరకు రవాణా రైళ్ళను, ప్రయాణికుల రైళ్ళ ను ప్రవేశపెట్టేందుకు వీలు ఏర్పడగలదు. సిమెంటు పరిశ్రమ లు సమీపం లోనే ఉన్న కారణం గా ఒకటో సంవత్సరం నుంచి ఒక్కో ఏడాది కి 5.67 మిలియన్ టన్నుల మేరకు అదనపు సరకు రవాణా నమోదు కావచ్చన్న అంచనా ఉంది. అది 11వ సంవత్సరం వచ్చేసరికల్లా ఒక్కో ఏడాది కి 9.45 మిలియన్ టన్నుల కు పెరిగేందుకు ఆస్కారం ఉంది. దీని తో సులభతర సంధానం అందుబాటు లోకి రావడం తో పాటు ఆ ప్రాంతం సామాజికం గా, ఆర్థికం గా అభివృద్ధి చెందేందుకు కూడా దోహదం లభించనుంది. ఈ ప్రాజెక్టు తో ఆ ప్రాంతం లో పర్యటన కు కూడా దన్ను లభిస్తుంది. ఎందుకంటే, ఊంచాగఢ్ కోట తో సహా అనేక చరిత్రాత్మక ప్రదేశాలు ఈ ప్రాజెక్టు రంగం లో నెలకొని ఉన్నాయి.

# ఔషధ కంపెనీల అక్రమాలకు తమ రహస్య ఆమోదం ఉందన్న తప్పుడు ప్రకటనలను ఖండించిన ఎన్‌పీపీఏ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:జాతీయ ఔషధ ధరల నిర్ణయ ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) భారత ప్రభుత్వ రసాయనాలు-ఎరువుల మంత్రిత్వశాఖలోని ఔషధ విభాగం పరిధిలోగల ఒక నియంత్రణ సంస్థ. దేశవ్యాప్తంగా ప్రజలకు అందుబాటు ధరలో మందులు లభ్యమయ్యే విధంగా నిర్దేశిత, అనిర్దేశిత ఔషధ సమ్మేళనాల గరిష్ఠ ధరలను నిర్ణయించి, వాటి అమలును పర్యవేక్షించడం ఈ సంస్థ బాధ్యత. కాగా, అక్రమ పద్ధతులకు పాల్పడుతున్న ఔషధ కంపెనీలు ఒకే గరిష్ఠ ధరగల అనేక మందులను వివిధ రంగాలకు విభిన్న ధరలతో విక్రయిస్తున్నాయని, ఇందుకు 'ఎన్‌పీపీఏ' రహస్య ఆమోదం కూడా ఉన్నదని "జమ్ము ఫార్మస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్" (జేడీపీఏ) ఆరోపించినట్లు 2021 సెప్టెంబరు 22వ తేదీన 'ది డైలీ ఎక్సెల్సియర్' ఒక కథనం వెలువరించింది.

అయితే, ఔషధ కంపెనీల అక్రమాలకు తమ రహస్య ఆమోదం ఉందన్న తప్పుడు ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎన్‌పీపీఏ స్పష్టం చేసింది. నిర్దేశిత ఔషధ సమ్మేళనాలు, కొత్త మందులకు తాము నిర్దేశించిన చిల్లర ధరలను ఉల్లంఘిస్తే 'ఎన్‌పీపీఏ' ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అదేవిధంగా ఔషధ ధరల నియంత్రణ ఆదేశాలు (డీపీసీఓ)-2013లోని 20వ పేరాలో పేర్కొన్న మేరకు గడచిన 12 నెలల్లో అనిర్దేశిత మందుల గరిష్ఠ చిల్లర ధరలను 10 శాతానికిపైగా పెంచినా చర్యలు తప్పవని పేర్కొంది.

కాగా... వివిధ రంగాలకు వర్తించే గరిష్ఠ ధర/గరిష్ఠ చిల్లర ధరకన్నా తక్కువకు ఔషధ కంపెనీలు మందులు విక్రయించే అంశం 'ఎన్‌పీపీఏ' పరిధిలోకి రాదని కూడా స్పష్టం చేసింది. ఇది పూర్తిగా ఆయా కంపెనీల వాణిజ్య సంబంధిత నిబంధనల ప్రకారం సాగుతుందని, ఇది 'ఎన్‌పీపీఏ' నియంత్రణ చట్రానికి లోబడి ఉండదని విశదీకరించింది.

# ఐఏఎఫ్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:ఫైటర్ పైలెట్ ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరి ఇవాళ ఐఏఎఫ్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. చైనాతో ఉద్రిక్తత నెలకొన్న సమయంలో లడాఖ్ వద్ద ఇంచార్జ్‌గా వ్యవహరించారు. ఎయిర్ చీఫ్ ఆర్కేఎస్ భదౌరియా ఇవాళ రిటైర్ అయ్యారు. భదౌరియా 42 ఏళ్ల పాటు సర్వీసులో ఉన్నారు. 36 రాఫెళ్లు, 83 మార్క్ 1ఏ తేజస్ విమానాల కొనుగోళ్ల విషయంలో భదౌరియా కీలక పాత్ర పోషించారు. అయితే వీఆర్ చౌదరి వైమానికదళంలో ఎన్నో కీలక హోదాల్లో పనిచేశారు. కదనరంగంతో పాటు హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన విధులు నిర్వర్తించారు. వైమానిక రక్షణ వ్యవస్థల ఆధునీకరణలో చౌదరీ ముఖ్య పాత్ర పోషించనున్నారు. త్వరలో ఇండియా ఎస్-400 డిఫెన్స్ సిస్టమ్‌లను రష్యా నుంచి తీసుకురానున్నది. యుద్ధ విమానాల ఆధునీకరణలోనూ చౌదరీ బాధ్యత తీసుకోనున్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి కుమారుడు కూడా యుద్ధ విమాన పైలెట్. ఆయన రాఫెల్ యుద్ధ విమానాన్ని నడుపుతాడు.

1982లో చౌదరీ ఐఏఎఫ్‌లో చేరారు. 3800 గంటల పాటు ఫ్లయింగ్ అనుభవం ఉన్నది. ఫైటర్, శిక్షణ విమానాలను నడిపారు. ఆపరేసన్ మేఘదూత్‌లో పాల్గొన్నారు. 1980 దశకంలో సియాచిన్ గ్లేసియర్‌ను ఆక్రమించే సమయంలో ఆపరేషన్ మేఘదూత్ చేపట్టారు. కార్గిల్ యుద్ధ సమయంలో ఆపరేషన్ సఫేద్ సాగర్‌లోనూ పాల్గొన్నారు.



# 29 మంది విద్యార్థులకు కరోనా

ముంబై, సెప్టెంబర్ 30: మహారాష్ట్ర ముంబైలోని కేఈఎం మెడికల్ కాలేజీలో కరోనా కలకలం సృష్టించింది. 29 మంది విద్యార్థులకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అయితే, ఇందులో 27 మంది రెండు డోసుల కొవిడ్ టీకా తీసుకున్నారు. 29 మంది విద్యార్థుల్లో 23 మంది ఎంబీబీఎన్ సెకండియర్ చదువుతుండగా.. ఆరుగురు మొదటి సంవత్సరం విద్యార్థులు. ఇందులో ఇద్దరు విద్యార్థులను చికిత్స కోసం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చేర్చారు. మిగిలిన వారందరినీ ఐసోలేషన్‌కు తరలించారు. కళాశాలలో మొత్తం 1100 మంది వైద్య విద్యార్థులు ఉన్నారని కేఈఎం హాస్పిటల్ డీన్ హేమంత్ దేశ్‌ముఖ్ తెలిపారు.

# శ్రీవారి ఖజానాకు రూ. 6,52,343 ఆదాయం

యాదాద్రి, సెప్టెంబర్ 30:: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఖజానాకు గురువారం రూ. 6,52,343 ఆదాయం వచ్చినట్లు ఈవో గీత తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా 34,95 4, రూ.100 దర్శనం టిక్కెట్ ద్వారా 14,500, వేద ఆశీర్వచనం ద్వారా 3,612, నిత్య కైంకర్యాల ద్వారా 200, క్యారీ బ్యాగుల విక్రయం ద్వారా1,650, వ్రత పూజలతో 2,000, కల్యాణకట్ట టిక్కెట్ల ద్వారా 7,800, ప్రసాద విక్రయాల ద్వారా 2,17,000, వాహన పూజలతో 2,200,

టోల్‌గేట్ ద్వారా 750, అన్నదాన విరాళంతో 7,298, సువర్ణ పుష్పార్చన ద్వారా 33,460, యాదరుషి నిలయం ద్వారా 10,000, పాతగుట్ట నుంచి 3,355, గోపూజ ద్వారా 50, ఇతర విభాగా లతో 3,13,514 మొత్తంగా శ్రీవారి ఖజానాకు రూ.6,52,343 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

# ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద ఉధృతి



హైదరాబాద్ , సెప్టెంబర్ 30:తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కందకుర్తి వద్ద గోదావరి నది నాలుగో రోజు ఉధృతంగా ప్రవహిస్తోంది. అంతర్రాష్ట్ర వంతెనపై నుంచి వరద నీరు పోటెత్తుతోంది.

ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి దిగువకు ఇరిగేషన్ అధికారులు దాదాపు 4 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ మహారాష్ట్ర నుంచి, మంజీరా నది ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరడంతో గోదావరిలో ప్రవాహం ప్రమాదకర స్థాయిలో కనిపిస్తుంది. నిన్నటితో పోలిస్తే ఈ రోజు ఉదయానికి గోదావరి ఉధృతి భారీగానే ఉంది.

# మీతో తోలు తీయించుకోవడానికి ఇక్కడెవరూ సిద్ధంగా లేరు: సుచరిత

హైదరాబాద్ , సెప్టెంబర్ 30:జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ఏపీ మంత్రుల ఎదురుదాడి కొనసాగుతోంది. ఇటీవల సీఎం జగన్ పైనా, ఏపీ ప్రభుత్వంపైనా పవన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో తాజాగా హోంమంత్రి మేకతోటి సుచరిత పవన్‌పై ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్ తోలు తీస్తానని హెచ్చరిస్తున్నాడని, ఇక్కడెవరూ తోలు తీయించుకోవడానికి సిద్ధంగా లేరని అన్నారు. నిలకడలేని పవన్ ఎప్పుడు, ఎక్కడ ఉంటాడో తెలియదని విమర్శించారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల నిలబడితే, రెండు చోట్లా ప్రజలు ఓడించారని, మరి వచ్చే ఎన్నికల్లో ఇంకెన్ని చోట్ల నిలబడతారో, అసలాయనను ప్రజలు అంగీకరిస్తారో లేదో అంటూ వ్యంగ్యం ప్రదర్శించారు. ఓసారి తాను లెఫ్టిస్టునంటాడు? ఆ తర్వాత బీజేపీతో భాగస్వామినంటాడు? మరోసారి టీడీపీతో వెళతానంటాడు? పవన్ కల్యాణ్ ఎలాంటి వాడన్నది ప్రజలకు సంపూర్ణంగా స్పష్టమైందని వివరించారు.

ఇటీవల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీ పదవులు పంచుకున్న అనంతరం జనసేన, టీడీపీ మైత్రి బట్టబయలైందని సుచరిత వ్యాఖ్యానించారు. అటు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి శంకరనారాయణ గురువారం నాడు శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్‌పై విమర్శలు చేశారు. పవన్ దిక్కుమాలిన మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. పవన్ కు తెలిసిందల్లా ప్రభుత్వంపై బురదచల్లడం ఒక్కటేనని అన్నారు. రాష్ట్రంలో రుతుపవనాల సీజన్ ముగిశాక రోడ్ల మరమ్మతు పనులు చేపడతామని వెల్లడించారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు కూడా పవన్ కల్యాణ్‌పై ధ్వజమెత్తారు. పవన్‌కు రెండు నియోజకవర్గాల్లో ప్రజలు తాటతీసినా ఆయన బలుపు తగ్గలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజకీయం అంటే ఏంటో సీఎం జగన్‌ను చూసి నేర్చుకోవాలని పవన్‌కు హితవు పలికారు.

# టీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం: వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేశ్

జమ్మికుంట, సెప్టెంబర్ 30:: టీఆర్ఎస్ సర్కారుతోనే సంక్షేమం సాధ్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌కు మద్దతుగా గురువారం ఆయన జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఇంటింటా తిరుగుతూ టీఆర్ఎస్ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెల్లు శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. వారి వెంట నాయకులు సురేందర్ రావు, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ భీమ్‌రావు, ఉపసర్పంచ్ రవీందర్‌రావు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# భారత హాకీకి పునర్ వైభవం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:భారత్‌కు ఒలింపిక్స్‌లో హాకీ విభాగం నుంచి పతకం అందాలన్న కోరిక నెరవేరేందుకు మనదేశ హాకీ జట్టుకు దాదాపుగా 41 సంవత్సరాల కాలం పట్టింది. టోక్యో ఒలింపిక్స్ 2020 లో దృఢమైన పురుషుల హాకీ జట్టు భారత్‌కు పతకం అందించి తీపి విజయాన్ని సాధించిపెడుతూ చరిత్రను తిరగరాసింది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు సాధించిన కాంస్యం కేవలం పతకం మాత్రమే కాదు.. అది కోట్లాది మంది దేశ ప్రజల ఆశల్ని, కలల సాకారం చేసిన మధురానుభూతి. గతంలో ప్రపంచ హాకీని భారతదేశం శాసించింది. ఒలింపిక్స్‌లో ఎనిమిది సార్లు స్వర్ణ పతక విజేతగా నిలిచింది. అయితే, గత నాలుగు దశాబ్దాలలో ఆధునిక హాకీకి అనుగుణంగా ఎదగలేకపోతోంది. ఆస్ట్రర్ టర్ఫ్ యొక్క ఆగమనం,ఆట నియమాలలో అపూర్వమైన మార్పులు ప్రపంచ స్థాయి పోటీలలో పోరాడుతున్న భారత హాకీ అదృష్టం మందగింపునకు కారణమయ్యాయి. కానీ భారత హాకీ జట్టు కింది స్థాయి నుండి పైకి లేచి పుంజుకునే మార్గంలో సాగుతోంది. మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్సీలో చివరకు ఒలింపిక్స్‌లో అత్యధిక మంది కోరిన పతకాన్ని భారత్ గెలుచుకుంది. ఈ చారిత్రాత్మక విజయానికి భారత బృందాన్ని అభినందించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, "ఇది సరికొత్త భారతదేశం, పూర్తి విశ్వాసంతో కూడిన భారతదేశం. ఇది చారిత్రాత్మక రోజు, ఈ రోజు ప్రతి భారతీయుడి జ్ఞాపకార్థం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. స్వదేశానికి కాంవారు మన దేశంలోని యువతకు కొత్త ఆశను అందించారు. వారు మన దేశంలోని యువతకు కొత్త ఆశను అందించారు." అని పేర్కొన్నారు. అభినందన వేడుకలో బృందంలోని క్రీడాకారులు అందరూ తమతమ సంతకాలతో కూడిన హాకీ స్టిక్‌ను ప్రధాన మంత్రికి అందజేశారు. ఇప్పుడు లక్షలాది మంది భావి హాకీ క్రీడాకారులకు రెక్కలు అందించిన ఈ స్టిక్, ప్రధాన మంత్రి అందుకున్న బహుమతుల ఆన్‌లైన్ బిడ్ వస్తువులలో చేర్చబడింది. ఈ స్టిక్‌ను ఎవరు పొందాలనుకుంటున్నారో వారు,, ప్రధాని ఆన్‌లైన్ బిడ్డింగ్ సైట్ - జూఎవవఎవనిబినీబ.ఐనీల.తిని/ లో పాల్గొని పొందవచ్చు. సెప్టెంబర్ 17 నుండి ప్రారంభమైన ఈ ఆన్‌లైన్ బిడ్ అక్టోబర్ 7 వరకు కొనసాగుతుంది. వేలం ద్వారా సేకరించిన మొత్తం నమామి గంగే ప్రాజెక్ట్, గంగా నది పరిరక్షణ మరియు పునరుజ్జీవన కార్యక్రమానికి ఖర్చు చేయబడుతుంది.

# జనసేనానికి షాక్.. పవన్ శ్రమదానానికి నో పర్మిషన్!

అమరావతి, , సెప్టెంబర్ 30:ఏపీలో వైసీపీ ప్రభుత్వం, జనసేన పార్టీ మధ్య రాజకీయ వైరం ముదురుతోంది. వైసీపీ సర్కార్ పై తీవ్ర విమర్శలు చేసిన పవన్.. వచ్చే ఎన్నికల్లో కేలవం 15 సీట్లే వస్తాయంటూ జోస్యం చేప్పారు. రాష్ట్రంలోని రోడ్ల దుస్థితిపై అక్టోబర్ 2న శ్రమదానం చేయాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లాలోని ధవళేశ్వరంలోని ఆర్థర్ కాటన్ బ్యారేజీపై, అనంతపురం జిల్లా కొత్తచెరువలో పవన్ శ్రమదానం చేస్తానని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును జనసైనికులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే, కాటన్ బ్యారేజీ వద్ద పవన్ కార్యక్రమానికి ఇరిగేషన్ శాఖ అధికారులు అనుమతి ఇవ్వలేదు. బ్యారేజీపై మరమ్మతులు చేయడానికి వీల్లేదని.. గుంతలు పూడిస్తే బ్యారేజీ నష్టమని తెలిపారు. అంతేకాకుండా కాటన్ బ్యారేజీ ఆర్ అండ్ బీ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు.

మరోవైపు జనసేన పార్టీ నేతలు మాత్రం ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా తాము మాత్రం బ్యారేజీపై శ్రమదానం చేసి తీరుతామని తేల్చి చెబుతున్నారు. ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న తమను అడ్డుకోవాలని వైసీపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపిస్తున్నారు.కాగా, ఇటీవల రాష్ట్రంలోని రోడ్లను బాగుచేయాలంటూ జనసేన సోషల్ మీడియా ఉద్యమాన్ని కూడా చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రోడ్లను మరమ్మతులు చేసేందుకు శ్రమదానం కార్యక్రమానికి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. తాను కూడా రెండు చోట్ల పాల్గొంటానని ప్రకటించారు. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. అయితే, అనుహ్యంగా ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో అక్టోబర్ 2న ధవళేశ్వరం వద్ద ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# భవానీపూర్ ఉప ఎన్నికలో ఘర్షణ.. బీజేపీ నేత కారు ధ్వంసం

కోల్‌కతా, సెప్టెంబర్ 30:: పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నిక జరిగిన భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ, టీఎంసీ కార్యకర్తల మధ్య గురువారం ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో బీజేపీ నేత కళ్యాణ్ చౌబే కారును ధ్వంసం చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు.కాగా, ఒక పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో ఇద్దరు నకిలీ ఓటర్లను గుర్తించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని బీజేపీ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కళ్యాణ్ చౌబే ఆరోపించారు. దీని గురించి పోలీసులకు, కేంద్ర బలగాలకు సమాచారం అందించామని చెప్పారు. ఇంతలో ఎనిమిది నుంచి పది మంది బైకులపై వచ్చి కర్రలు, రాళ్లతో తన కారుపై దాడి చేసి ధ్వంసం చేసినట్లు మీడియాకు తెలిపారు.

## పెంచిన పెట్రోల్.. డీజిల్.. గ్యాస్ ధరలకు నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం .



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరు ఉద్యమించాలని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పెంచిన పెట్రోల్..డీజిల్.. వంట గ్యాస్ ధరలకు నిరసనగా రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అఖిలపక్షం నాయకులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం.. ఏడు సంవత్సరాల పాలనలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీనీ తుంగలో తొక్కి దేశంలోని నిరుద్యోగ యువకులను మోసం చేసిందని ఆరోపించారు. కొత్తగా ఉద్యోగాలు కల్పించకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఉన్న ఉద్యోగాలను తొలగిస్తుందని విమర్శించారు. రైతులు గత పది నెలలుగా రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పోరాడుతుంటే పట్టించుకోని నరేంద్ర మోడీ రైతుల ఉద్యమాన్ని నిరంకుశంగా అణిచివేయాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకు వచ్చి జాతి సంపదను మొత్తం కార్పొరేట్ కంపెనీ పెత్తందారులైన అంబానీ..ఆధానీ లకు, బడా పెట్టుబడిదారులకు దారాదత్తం చేయాలని చూస్తున్నాడని మండిపడ్డారు. దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను పెంచి పేద ప్రజలపై మరింత భారం మోపుతున్నాడని, మోదీ నిరంకుశ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు సీఎం కేసీఆర్ కూడా మద్దతు నిస్తున్నాడని చెప్పారు.వీరి అనైతిక బంధానికి వ్యతిరేకంగా యువకులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్ ,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సంగ స్వామియాదవ్, నాగుల విష్ణు గౌడ్ , ప్రధాన కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ , కాంగ్రెస్ వేములవాడ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు, సంగీత శ్రీనివాస్ సాగరం వెంకటస్వామి,ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్ కాంగ్రెస్ నాయకులు చిలుక రమేష్ ,కూరగాయల కొమురయ్య , జెఏసి కోకన్వీనర్ బొజ్జ కనకయ్య ,టిడిపి పట్టణ అధ్యక్షుడు శేఖర్ గౌడ్,సిపిఐ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.×

## విద్యార్థికి సన్మానం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి నవత విద్యాలయం పాఠశాల నుండి జవహర్ నవోదయ కు ఎంపికైన విద్యార్థిని అభినయశ్రీ ని చందుర్తి సిఐ శ్రీలత ఎస్సై సునీల్ పోలీస్ స్టేషన్ లో గురువారం శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... చిన్నారి అభినయశ్రీ నవోదయ కి ఎంపిక కావడం అభినందనీయమని విద్యార్థులు కష్టపడుతూ కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ప్రపంచంలో వెలకట్టలేని ఏకైక సంపద చదువేనని ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరాలన్నారు. అలాగే చిన్నారి అభినయశ్రీ భవిష్యత్తులో ఇంకా బాగా చదువుతూ మంచి స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు.తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులు కు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పత్తిపాక నాగరాజుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్లు లు ఏనుగుల కృష్ణ,కొడగంటి గంగాధర్, రాజురి సద్గుణ చారి పాల్గొన్నారు,

## గ్యాస్ సిలిండర్‌పై నిర్ణీత రేటు కన్నా అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు..!

### -అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సంగారెడ్డి, సెప్టెంబర్ 30(నేటినిజం ప్రతినిధి) గ్యాస్ సిలిండర్ పై వినియోగదారుల నుండి అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లాలోని ఎల్పీజీ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్యాస్ సిలిండర్ పై 20 నుండి 30 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గ్యాస్ సిలిండర్ నిర్ణీత ధర కన్నా అదనంగా డబ్బులు వసూలు చేయరాదని ఆయన స్పష్టం చేశారు.ఎవరైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే , సంబంధిత ఏజెన్సీ పై ఈ.సి. యాక్ట్ 1955 ప్రకారం డీలర్ షిప్ రద్దు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

జిల్లాలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి రాధికా రమణి, ఉప తహశిల్దార్, జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ డీలర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులలో విద్యతోనే మార్పు : ఎమ్మెల్యే రామన్న



ఆదిలాబాద్, సెప్టెంబర్ 30: గిరిజనులలో విద్యతోనే మార్పు సాధ్యమని ఆదిలబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇలా అన్ని వర్గాలకు కార్పొరేట్ విద్య అందేలా సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామ పంచాయతీలోని సిరికొండ గ్రామంలో ఎంపీటీసీ నిధుల నుండి రెండున్నర లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ పనులను ప్రారంభించారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గిరిజనుల కష్టాలను అర్థం చేసుకొని వారి అభ్యున్నతి కోసం పాటుపడుతున్న వ్యక్తి అని తెలిపారు. నేడు ఆదీవాసి, గిరిజన గ్రామాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం కేసీఆర్ గిరిజన విద్యార్థుల భవిష్యత్తును వారి జీవన విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించారని తెలిపారు.

కేంద్రనీలోని బిజెపి ప్రభుత్వం ఆదిలాబాద్ లోని పరిశ్రమల ఆస్తులను అమ్ముకోవడంలో చూపించే ఉత్సాహం, గిరిజనుల అభ్యున్నతికి పాటుపడడంలో చూపించడం లేదని విమర్శించారు. ఇలాంటి తరుణంలోనే గిరిజనులు చైతన్యం కావాలంటే విద్య అనే ఆయుధాన్ని వాడుకోవాలని గిరిజనులకు ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల విద్యాభివృద్ధకి కృషి చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ కార్పొరేట్ విద్యను గ్రామ స్థాయిలో కి తీసుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మండల అధ్యక్షుడు కొడప సోనే రావు, ఎంపీపీ మడావి నాగు బాయ్ కిషన్, సర్పంచ్ భూమన్న, సేవా లక్ష్మి, జగదీష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దివాకర్ రావు చిత్ర పటానికి క్షీరాభిషేకం

హాజీపూర్, సెప్టెంబర్ 30:: ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ప్యాకేజీ కింద రూ. 13 కోట్లను చేసినందుకుగాను సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు చిత్రపటాలకు టీఆర్ఎస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. నిధుల మంజూరుతో పాటు నిర్వాసితుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయించారని టీఆర్ఎస్ హాజీపూర్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఎల్లంపల్లి పునరావాస కాలనీల్లో ప్లాట్లు ఉన్న వారికి ఇంటి నిర్మాణ ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి రూ. 70 వేలు ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ మందపెల్లి శ్రీనివాస్ మాట్లాడు తూ.. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఎమ్మెల్యేగా ఉన్న దివాకర్ రావు నిర్వాసితులకు అండగా ఉంటూ నిర్వాసితులకు నష్ట పరిహారం అందించడంలో ఎనలేని కృషి చేశారన్నారు. 1450 మందికి ఒక్కొక్కరికి రూ.70 వేలు, గతంలో 9 గ్రామాల్లో సర్వేలో తప్పిపోయిన 10 నివాస గృహాలకు, ఓపెన్ స్థలానికి, యువకులకు, మేజర్‌సన్స్?కు కూలీ డబ్బుల కింద ఒక్కొక్కరికి 2 లక్షల పరిహారం ఇప్పించారన్నారు. ఎమ్మెల్యే దివాకర్ రావు నిర్వాసితులకు ఏమి చేశారని విమర్శించిన వారికి ఇది చెంప పెట్టులాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గోళ్ల శ్రీనివాస్, కొట్టె మహేందర్, అనె మల్లేశ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మండల ప్రధాన కార్యదర్శి జీవన్ రావు, మండల యువత అధ్యక్షుడు బాపు, సునీల్ రావు, మండల నాయకులు పాల్గొన్నారు.

## రూ. 2.5 లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు సీజ్

హైదరాబాద్ , సెప్టెంబర్ 30: నగరంలోని పాతబస్తీలో ఎలక్ట్రానిక్ సిగరెట్లు, నిషేధించబడిన పొగాకు ఉత్పత్తులను దక్షిణ మండల పోలీసులు భారీగా స్వాధీనం చేసుకున్నారు. ఘట్టీషేరాన్ ప్రాంతంలో లక్కీ కలెక్షన్ దుకాణంలో ఎలక్ట్రానిక్ సిగరెట్లు, నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది.

దీంతో గురువారం సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా వెబ్ స్మోక్ సిల్వర్ బ్లాక్ ఈ-సిగరెట్లు(32 బాక్సులు), 1 జాయ్ డైమండ్ బేబీ టాయ్ ఈ-సిగరెట్లు(33 బాక్సులు), అల్ ఫక్రీ జ్యూస్ ఫ్లేవర్ 20 బాక్సులు(ఒక్కో బాక్సులో 10 బాటిల్స్ ఉంటాయి)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 2.5 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. దుకాణ యజమాని మహమ్మద్ జోహెబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటన

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 30:: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న నిర్మల్ పట్టణంలోని ప్రాంతాలను బుధవారం రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారుఖీ, అధికారులు సందర్శించారు.వర్షాల కారణంగా ఇబ్రహీం చెరువు పూర్తిగా నిండిపోవడంతో చెరువు ప్రాంతంలో ఉన్న అక్రమ లేఅవుట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. చెరువు ప్రాంతం కబ్జాకు గురి కావడంతో అలుగు పూర్తిగా మూసుకుపోవడంతో నీటిని బయటకు తరలించేలా పునరుద్ధరణ పనులు చేపట్టాలని తెలిపారు. అనుమతి లేకుండా లే అవుట్‌లను చేసి ప్లాట్లను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లను కొని ప్రజలు ఇబ్బందులు పడవద్దని తెలిపారు.

గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పట్టణంలోని దివ్యనగర్ కాలనీలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు.నీటిని బయటకు పంపి పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. నిర్మల్ పట్టణం లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలోని నూతన మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించారు.మిషన్ భగీరథ పనులు, రోడ్డు విస్తరణ, సుందరీకరణ, అంబేద్కర్ భవన నిర్మాణ పనులు వరదల కారణంగా నష్టపోయిన వారి వివరాలను



అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, కౌన్సిలర్లు సంపంగి రవి, శ్రీకాంత్ తదితరులున్నారు.

## బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక పర్యటన

బాన్సువాడ, సెప్టెంబర్ 30:: రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి బుధవారం బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని వంద పడకల మాతా, శిశు దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వసతులు, వైద్యారోగ్య సేవలను అడిగితెలుసుకున్నారు. అనంతరం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడారు. డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని వివరించగా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షంతో కూలిన ఇండ్లకు బదులుగా ప్రభుత్వ ఇండ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.కాలనీలో రోడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. కల్కిచెరువకు కట్టను సందర్శించి కట్టపై నిర్మిస్తున్న బోటింగ్ పాయింట్‌ను, పనులను పరిశీలించారు. నీటి



పారుదల శాఖ డీఈ శ్రావన్ కుమార్ రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకొని, పలు సూచనలు చేశారు. పట్టణానికి చెందిన భూదవ్వ అనే మహిళ తన భర్త కరోనాతో చనిపోయాడని తనను ఆదుకోవాలని విన్నవించుకోగా తక్షణవే 5వేల రూపాయలను అందజేశారు. ఆమెకు వృద్ధాప్య పింఛన్‌తో పాటు వ్యక్తిగతంగా ప్రతి నెలా రెండువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు. స్పీకర్ వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ , కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి అధ్యక్షతన 38వ 'ప్రగతి' సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ 38వ 'ప్రగతి' సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఐసీటీ ఆధారిత బహుముఖ వేదిక "చురుకైన పాలన-సకాలంలో అమలు" (ప్రగతి) సంబంధిత అంశాలపై ఈ సమావేశం చర్చించింది. ఈ సందర్భంగా మొత్తం 8 ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. వీటిలో నాలుగు రైల్వే, రెండు విద్యుత్, ఒకటి రోడ్డు-రవాణా జాతీయ రహదారులు, మరొకటి పౌరవిమానయానం శాఖలకు సంబంధించిన ప్రాజెక్టులున్నాయి. దాదాపు రూ.50,000 కోట్ల విలువైన ఈ ఎనిమిది ప్రాజెక్టుల పనులు ఏడు రాష్ట్రాలు-ఒడిషా, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణాలలో జరుగుతున్నాయి. కాగా, మునుపటి 37వ 'ప్రగతి' సమావేశంలో దేశవ్యాప్తంగా సాగుతున్న రూ.14.39 లక్షల కోట్ల విలువైన 297 ప్రాజెక్టులపై సమీక్షించారు.

## నీమచ్-రత్ లామ్ రైల్ వే లైను డబ్లింగుకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:ఒకటో సంవత్సరం నుంచి సరకు రవాణా పరిమాణం ప్రతి ఒక్క ఏడాది లోనూ 5.67 మిలియన్ టన్నులు అదనం గా ఉండవచ్చు; అది కాస్తా 11వ సంవత్సరం లో పెరిగిపోయి ప్రతి ఒక్క ఏడాది లో 9.45 మిలియన్ టన్నుల కు చేరుకోవచ్చును

నీమచ్-రత్ లామ్ రైల్ వే లైను డబ్లింగ్ పనుల కు మాననీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఆమోదాన్ని తెలియజేసింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం 1,095.88 కోట్ల రూపాయలు గా ఉండవచ్చు. పనులు పూర్తి అయ్యే సరికి దీని వ్యయం పెరిగి 1,184.67 కోట్ల రూపాయల కు చేరుకొనేందుకు ఆస్కారం ఉంది. ఈ లైను డబ్లింగ్ తాలూకు మొత్తం పొడవు 132.92 కిలోమీటర్ లు. ఈ ప్రాజెక్టు నాలుగు సంవత్సరాల లో పూర్తి కావచ్చని భావిస్తున్నారు.

మెంటనన్స్ బ్లాకుల తో కలుపుకొంటే నీమచ్-రత్ లామ్ సెక్శన్ తాలూకు లైను సామర్థ్య వినియోగం 145.6 శాతం వరకు ఉంది. ఈ ప్రాజెక్టు లైన్ సెక్శను లో మెంటనన్స్ బ్లాకు ఏర్పాటు చేయకపోయినప్పటికీ ఈ మార్గం గుండా అభిలషణీయమైన స్థాయి కి మించిన సరకు రవాణా రాక పోక లు జరిగాయి. సిమెంటు కంపెనీ లు వాటి స్వీయ అవసరాల కోసం ఏర్పాటు చేసుకొన్న పవర్ ప్లాంటు లకు అవసరపడ్డ బొగ్గు ను ఈ మార్గం ద్వారా ప్రధానం గా చేరవేయడం జరిగింది. నీమచ్-చిత్తౌడ్ గఢ్ ప్రాంతం లో సిమెంటు గ్రేడు సున్నపు రాయి తాలూకు భారీ నిక్షేపాలు అందుబాటు లోకి రావడం తో కొత్త గా సిమెంటు పరిశ్రమలను ఏర్పాటు అవుతున్న కారణం గా ఈ సెక్శన్ లో సరకు రాకపోకలు మరింత గా పెరుగనున్నాయి.

నీమచ్-రత్ లామ్ సెక్షన్ డబ్లింగు తో ఈ సెక్శన్ సామర్థ్యం హెచ్చనుంది. ఈ విధం గా వ్యవస్థ లోకి మరిన్ని సరకు రవాణా రైళ్ళ ను, ప్రయాణికుల రైళ్ళ ను ప్రవేశపెట్టేందుకు వీలు ఏర్పడగలదు. సిమెంటు పరిశ్రమ లు సమీపం లోనే ఉన్న కారణం గా ఒకటో సంవత్సరం నుంచి ఒక్కో ఏడాది కి 5.67 మిలియన్ టన్నుల మేరకు అదనపు సరకు రవాణా నమోదు కావచ్చున్న అంచనా ఉంది. అది 11వ సంవత్సరం వచ్చేసరికల్లా ఒక్కో ఏడాది కి 9.45 మిలియన్ టన్నుల కు పెరిగేందుకు ఆస్కారం ఉంది. దీని తో సులభతర సంధానం అందుబాటు లోకి రావడం తో పాటు ఆ ప్రాంతం సామాజికం గా, ఆర్థికం గా అభివృద్ధి చెందేందుకు కూడా దోహదం లభించనుంది. ఈ ప్రాజెక్టు తో ఆ ప్రాంతం లో పర్యటన కు కూడా దన్ను లభిస్తుంది. ఎందుకంటే, ఊంచాగఢ్ కోట తో సహా అనేక చరిత్రాత్మక ప్రదేశాలు ఈ ప్రాజెక్టు రంగం లో నెలకొని ఉన్నాయి.

## ఉల్లి కొనుగోళ్లు ప్రారంభించాలి: రైతులు నిరసన

అమరావతి, , సెప్టెంబర్ 30:ఉల్లి కొనుగోళ్లను తక్షణమే ప్రారంభించి రైతులను కార్మికులను ఆదుకోవాలి ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. కర్నూలులో రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రైతులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో బోరుబావుల కింద మెట్ట భూములలో సుమారు 30 వేల ఎకరాలు ఉల్లి పంట సాగు చేశారని తెలిపారు. పండిన పంటను కొనుగోలు చేసే పరిస్థితి లేక రోడ్ల వెంట తిరిగి అమ్ముకునే ఇటువంటి దుస్థితి రైతులకు ఏర్పడింది ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతులు హైదరాబాద్ మార్కెట్ కు తీసుకెళ్లినా.. అక్కడ కూడా ధర లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ జోక్యం చేసుకుని చేసుకుని ఉల్లి పంటను కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.




## వ్యక్తిగత విమర్శల వల్ల పరిశ్రమ పరువు పోతోంది: బాబూ మోహన్



హైదరాబాద్ , సెప్టెంబర్ 30:త్వరలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆన్‌లైన్ టికెట్ల విషయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారగా.. దీనిపై పోసాని విమర్శల దాడి చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సినీనటుడు బాబూమోహన్ స్పందించారు. ఆయన మా ఎన్నికల్లో మంచు విష్ణు ప్యానెల్ లో ఉన్న విషయం తెలిసిందే. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా బాబూమోహన్ పోటీపడుతున్నారు. పవన్ కల్యాణ్-పోసాని వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ? 'ఇద్దరూ కలిసి కళామతల్లి పరువు తీయకూడదు. నిన్న మా విష్ణు బాబు ఓ ప్రశ్న వేశారు. అందులోనే ఓ విషయం ఉంది. పవన్ కల్యాణ్ అన్ని మాటలు మాట్లాడారు.. ఆయన ఇండస్ట్రీ సైడా? ప్రకాశ్ రాజ్ సైడా? ముందుగా పవన్ కల్యాణ్ తేల్చుకోవాలి. సర్కారు సహకారం ఇండస్ట్రీకి అవసరం. ప్రభుత్వాన్ని ఇండస్ట్రీనే ఓ విషయం అడిగింది. దీనిపై పవన్ కల్యాణ్ ఏదేదో మాట్లాడారు' అన్నారు బాబూమోహన్.

'అందుకే ఇండస్ట్రీ సైడా? ప్రకాశ్ రాజ్ సైడా? అని పవన్ ను విష్ణు బాబు ప్రశ్నించారు. ఏది ఏమున్నా తెరచాటునే అన్ని విషయాలు చూసుకోవాలి. అంతేగానీ, తెరముందుకు వచ్చి మాట్లాడడం ఏంటీ? మనం ఇంత చిరాకుతో మాట్లాడడం ఎందుకు? చక్కగా నవ్వుతూ మాట్లాడుకోవచ్చు. వ్యక్తిగతంగా విమర్శలు చేసుకోవడం వల్ల మన పరిశ్రమ పరువుపోతోంది. అంత పెద్ద అన్యాయమే జరిగితే పెద్ద మనుషుల దగ్గర కూర్చొని మాట్లాడుకోవాలి' అని బాబూమోహన్ చెప్పారు.

## పల్లె ప్రకృతి వనాల్లో అన్ని రకాల మొక్కలు నాటాలి : డీఆర్‌డీవో కౌటిల్యారెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 30:పల్లెప్రకృతి వనాల్లో అన్ని రకాల మొక్కలను నాటాలని డీఆర్‌డీవో కౌటిల్యారెడ్డి అన్నారు. గురువారం ఆయన కొదరుపాక ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లె ప్రకృతి, హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించి మాట్లాడారు.

పల్లె ప్రకృతివనాల్లో అన్ని రకాల పూలు, పండ్ల మొక్కలను నాటాలని, అదేవిధంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నల్ల రాజేందర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి గంగాతిలక్ , ఉప సర్పంచ్ రవిచందర్ , కార్యదర్శి అంజలి ఉన్నారు.

# వయోధికులకు 'వంద'నాలు







## పరిచయం

ప్రతి సంవత్సరం అక్టోబర్, 1వ తేదిన ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. వయోధికులైన వృద్ధులు, సీనియర్ సిటిజన్లకు అక్టోబరు, 1వ తేది ప్రత్యేకమైనది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగానూ, మన భారతదేశంలో పెరుగుతున్న జనాభా అంచనా ప్రకారం వృద్ధులు, సీనియర్ సిటిజన్లపై దృష్టి సారించేందుకు దీనిని ఒక అవకాశంగా తీసుకుంటుంది. మీడియా మాధ్యమాలు సైతం వృద్ధాశ్రమాలకు వెళ్ళి వృద్ధులను కలిసి వారికిగల మానసిక ఆరోగ్య సమస్యలను తెలుసుకొని పత్రికలలో ప్రచురించడం, రేడియో, టి.వి. ఛానల్స్‌లో వారి ఇంటర్వ్యూలను ప్రసారం చేయడం జరుగుతుంది. తద్వారా సమాజంలో వారి పట్ల అవగాహన కలిగి సానుకూలత వ్యక్తపరిచేందుకు వీలవుతుంది. సమాజంపై ప్రభావం చూపించగలిగిన వారు వృద్ధుల్లోనూ ఉంటారు. వారికున్న అనుభవం ద్వారా మిగిలిన వారికి కూడా అది ప్రోత్సాహకరంగా ఉంటుంది. అందువల్ల ప్రతి ఏడాది అక్టోబరు, 1వ తేది అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం నాడు పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలైన కార్యాలయాలలో కూడా వయోధికులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

## వృద్ధులకు ప్రత్యేక దినంగా అంతర్జాతీయ గుర్తింపు

ఐక్యరాజ్యసమితి (ప్రపంచ ఆరోగ్య సంస్థ) జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 14, 1990 న ఆమోదించింది, అక్టోబర్ 1 వ తేదీని అంతర్జాతీయ వయోధికుల దినంగా ప్రకటించింది. అప్పటినుండి వయోధికుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమైన పాత్ర పోషిస్తూ, ఆ రోజు వయోధికులలో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తుంది. వృద్ధాప్య జనాభా అంచనా, అంచనాకు సరిపడ ఆరోగ్య సదుపాయాలు, సామాజిక సంరక్షణ, స్వచ్ఛందంగా వారికి సేవలను అందించేందుకు చర్చలు జరుపుతారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం 60 ఏళ్లు పైబడిన వారు 700 మిలియన్ల మంది ఉన్నారు. 2050 నాటికి ఈ సంఖ్య 2 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. ఈ గణాంకాలు వల్ల వారిపై మరింత దృష్టిని పెట్టేందుకూ, ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించే విధంగా, వివిధ కార్యక్రమాలు ప్రారంభించేందుకు సిద్ధమౌతుంది. ఉదాహరణకు, 1982 లో ఆమోదించబడిన వృద్ధాప్యం పై వియన్నా ప్లాన్ ఆఫ్ యాక్షన్. యునైటెడ్ నేషన్స్ ప్రిన్సిపల్స్ ఫర్ ఓల్డ్ పర్సన్స్ 1991 లో ఆమోదించబడింది.

## వయోధికులపై క్రీయాశీలత

ఈ లోకంలో పసిపిల్లల నుండి పండు ముదుసళ్ల వరకూ రకరకాలైన వయసులవారు ఉంటారు. మనిషి శరీరంలో వచ్చే మార్పులకు వీరంతా సాక్షులు. మనం తర్వాతి దశలలో ఏమవుతామో వీరిని చూసి తెలుసుకోవచ్చు. ఇదివరకటి రోజులలో మనిషి ఆయుఃప్రమాణం చాలా తక్కువ. యాభై ఏళ్ళు బ్రతికితే ఎంతో గొప్ప! వైద్యసదుపాయాలు సరిగా లేకపోవడమే దానికి కారణం. ఎప్పుడూ ఏదో ఒక మహమ్మారి విరుచుకుపడి, వందలాది మందిని ఊడ్చిపెట్టడం తరచు జరిగేది. రెండు శతాబ్దాల క్రితం అంటే 1800 సంవత్సరంలో ప్రపంచ దేశాలలో ప్రజల సగటు ఆయుర్దాయం 32 ఏళ్ళు మాత్రమే ఉండేదట, 1950 నాటికి అది 48కి పెరిగింది. ఇప్పుడు అది 73 ఏళ్ళు. ఇక ముందు ఇది ఇంకా వేగంగా పెరుగుతుందనీ, 2000 సంవత్సరంలో పుట్టిన పిల్లలు వారి వారి ఆర్థిక పరిస్థితుల నేపధ్యంలో సగం మంది నూరేళ్ళపైనే జీవిస్తారనీ అంటున్నాయి అమెరికాలో జరుగుతున్న పరిశోధనలు. వైద్యరంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల, ప్రతి ఒక్కరికి వైద్యం అందుబాటులోకి రావడంతో ఎక్కువ కాలం బ్రతికే అవకాశాలు పెరిగాయి. దీంతో వయోధికుల సంఖ్య మున్నెన్నడూ లేనంతగా పెరిగిపోతోంది. 2050 సంవత్సరానికీ ఈ భూమ్మీద 60 సంవత్సరాలకు పైబడిన వారి సంఖ్య యువజనుల సంఖ్యను మించిపోగలదని అంచనా. బాగా అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలలో 1998 నాటికే ఇలాంటి మార్పు సంభవించిందంటారు. వయోధికులు(వృద్ధులు) పెరిగితే ఏమవుతుందిలే అని కొట్టిపారేయడానికి వీల్లేదు. ఈ పరిణామం తెచ్చే సమస్యలు అనేకం. పని చేయగలిగే వయసులో వున్నవారి కంటే రిటైర్ అయిన వారి సంఖ్య ఎక్కువ కావడం ఒక ప్రధానసమస్య. తరాల నడుమ వుండే అంతరాలు మరొక సమస్య. వయోధికుల బాగోగులు ఎవరు చూస్తారనేది ఇంకొక సమస్య. మానవాళి మనుగడకు ఇది పెను సవాలు కాబోతోంది. ఆర్థికాభివృద్ధిపై దీని ప్రభావం పడనుంది. పొదుపు, పెట్టుబడులు, వినియోగం, శ్రామిక మార్కెట్లు, పెన్షన్లు, పన్నుల వంటి వాటిని ఇది ప్రభావితం చేయనుంది. ఆర్థికపార్శ్వాన్నే కాదు, సామాజికరంగాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తుంది. ఆరోగ్యం, కటుంబం వంటి రంగాలలో కూడా దీని ప్రభావం ఉంటుంది. 20వ శతాబ్ది నుండే వయోధికుల సంఖ్యలో పెరుగుదల కనిపించడం మొదలైంది. 21వ శతాబ్దిలో ఇది మరింత వేగం పుంజుకుంది. 1950లలో వయోధికుల నిష్పత్తి 8 శాతమైతే, 2000వ సంవత్సరంలో ఇది 10 శాతం. 2050 సంవత్సరానికల్లా ఇది 21 శాతం కానుంది. ముందు ముందు ఇది ఇంకా పెరుగుతుందే కాని తగ్గదు. ఒక వైపు జననాలు పెరగడం, ఇంకో వైపు మరణాల సంఖ్య తగ్గడం దీనికి కారణం. 21వ శతాబ్ది ప్రారంభంలో, ప్రపంచం మొత్తం మీద 60 కోట్ల మంది వయోధికులు (60 ప్లస్) వున్నట్లు గుర్తించారు. కడచిన 50 సంత్సరాలతో పోల్చితే వయోధికుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. ఇక 2050 నాటికి వీరి సంఖ్య 200 కోట్లు అవుతుందని అంచనా. యాభై ఏళ్లలో మళ్లి మూడు రెట్లు పెరగడమన్న మాట! మిగతా వయసులవారి కంటే వయోధికుల సంఖ్యనే ఎక్కువగా పెరుగుతోంది. ఇదే అసలు సమస్య. 2025-2030 సంవత్సరాల నడుమ వయోధికుల వృద్ధిశాతం 2.8 శాతం వుండగలదని భావిస్తున్నారు. ఇంత వేగంగా వయోధికుల సంఖ్య పెరగడమన్నది ముందు ముందు మరిన్ని పెను సమస్యల్ని సృష్టించగలదని అందోళన వ్యక్తమవుతోంది. 2050 సంవత్సరానికల్లా వయోధికుల్లో ఐదింట ఒక వంతు మంది 80 ఏళ్ల వాళ్లుంటారట. మహిళా వయోధికుల సంఖ్య పెరగటం. ఆయుః ప్రమాణం పురుషులలో కంటే స్త్రీలు 6 కోట్ల 30 లక్షలమంది ఎక్కువని తేలింది. వయోధికులు పెరగడమంటే, వారి బాగోగులు చూసుకోవలసిన బాధ్యత పెరిగిందని అర్థం. మానవాళి ఇంతకు మునుపెన్నడూ ఎదుర్కోని కొత్త సమస్య ఇది. అందుకే అంతర్జాతీయ స్థాయిలో దీనిపై కసరత్తు మొదలైంది. ఐక్యరాజ్యసమితి ఏటా అక్టోబర్, 1న అంతర్జాతీయ వయోధికుల దినోత్సవాన్ని జరపడం, 2021 అక్టోబర్, 1న జరుపుకోబోయే వయోధికుల దినోత్సవం ముప్పైఒకటవది. వయోధికుల జీవనప్రమాణాలను పెంచడం, సామాజిక, రాజకీయ, ఆర్థికకార్యక్రమాలలో వారి భాగస్వామ్యాన్ని పెంచడం - ఐక్యరాజ్య సమితి ఉద్దేశ్యం. మాడ్రిడ్ ఇంటర్నేషనల్ ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను అమలు చేయడం కోసం ఐక్యరాజ్య సమితి పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. వయోధికులు సమాజానికి భారమన్న అభిప్రాయం పొగొట్టేందుకు, వారినీ అభివృద్ధి క్రమంలో భాగస్వాములను చేయాలన్నది ఆలోచన. వయోధికులు నడిపే ప్రాజెక్టులను, వ్యాపారాలను ప్రదర్శించడం వంటి కార్యక్రమాలను చేపడుతుంది. వారిని కూడా అన్ని సామాజికరంగాలలోనూ క్రియాత్మకంగా భాగస్వాములను చేయడం ద్వారా, ఆ సమస్యను పరిష్కరించవచ్చు. వయోధికుల బాగోగులు చూడడం యువతరం కనీస నైతికబాధ్యత కూడా. అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం జరుపుకోవడానికి కారణం ఆ బాధ్యతను గుర్తు చేసుకునేందుకు కూడా.

## వయోధికుల ఆరోగ్య సూచనలు

ప్రతిరోజూ ఫిట్‌గా ఉండేలా శారీరక శ్రమ (యోగ, తదితర ఎక్ససైజులు), ఆరోగ్యకరమైన బరువును మెయింటెయిన్ చేస్తూ అనారోగ్యాన్ని నివారించడానికి లేదా నియంత్రించడానికి, 6 గంటల లేదా 8 గంటలు నిద్రకు కేటాయించడం, క్రమశిక్షణతో నియమబద్ధంగా నడక, వ్యాయామం, ధ్యానం (మెడిటేషన్) రోజులో ఒక గంట సమయం వినియోగించుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. శారీరక శ్రమతో కలిపి, సరైన మొత్తంలో పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం వలన వృద్ధులు ఆరోగ్యంగా ఉండగలుగుతారు. గుండె జబ్బులు, ఊబకాయం, అధిక రక్తపోటు, టైప్-2 డయాబెటిస్ మరియు బోలు ఎముకల వ్యాధి వంటి అనేక అనారోగ్యకరమైన ఆహార మార్పులకు విధిగా తీసుకునే ఆహారంలో సరిచూసుకోవడమే కాకుండా సప్లిమెంటేషన్‌గా కాల్షియం, విటమిన్ డి తీసుకోవడం ద్వారా మహిళల్లో బోలు ఎముకల వ్యాధిని నివారించడంలో సహాయపడుతుంది. అధిక బరువు ఉండటం ద్వారా గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు వల్ల వయోధికుల ఆరోగ్యం ప్రమాదాన్ని పెంచుతుంది. కైజర్ శాశ్వత (బాడీ మాస్ ఇండెక్స్) కాలిక్యులేటర్ ఉపయోగించి వారి ఎత్తును ప్రామాణికంగా అనుసరించి, ఎంత బరువు ఉన్నారో తెలుసుకుంటూ, అనారోగ్యకరమైన బరువును తగ్గించుకోండి. వారు నివశించే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, నీటితో కలిపిన మజ్జిగ, రాగి, జొన్నలు, సబ్జా, బార్లీ గింజల జావలు ఇంకా ఇతర చలువచేసే జావలు తీసుకోవడం ద్వారా అధిక బరువుని తగ్గించుకోవచ్చు. 'నీరు కేలరీలు లేనిది'! వయసు పెరిగే కొద్దీ వృద్ధులు పడిపోయే ప్రమాదం ఉంది. బహుజాగ్రత్త చూపించవలసిన అవసరం ఉంది. అందుకు నడిచే మార్గం హాలులో విద్యుత్ తీగలు, ఇంక ఇతరితర చెత్త చెదారం లేకుండా కార్పెట్ లేదా రగ్గులు వేయడం ద్వారా పడిపోకుండా నిరోధించవచ్చు. స్నానపు గదులలో రాత్రి సమయంలో లైట్ల వినియోగాన్ని స్పష్టంగా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. చెప్పులు ధరించడం అవసరం.

## వయోధికుల ఆరోగ్యం కాపాడుకోవడానికి 10 చిట్కాలు

**1.ధూమపానం - మత్తుపదార్థాలు వదిలేయండి**

వయోధికుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, వృద్ధాప్యాన్ని ఎదుర్కోవడానికి ధూమపానం మరియు మత్తుపదార్థాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులకు కారణమవుతుంది.

**2.సమపాలల్లో పౌష్టికహారం అవసరం**

వయోధికులు వయసు పెరిగే కొద్దీ జీర్ణవ్యవస్థ మందగిస్తుంది, కాబట్టి ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వరి, గోధుమ, జొన్నలు, రాగులు, కొర్రలు, తైదులు మొదలైనవి వారి శరీర తత్వాన్ననుసరించి ఇంకా ఇతర బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవడం అత్యవసరం.

**3.పుష్కలంగా నీరు**

వయోధికులు డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉన్నందున, వారు శక్తివంతంగా ఉండటానికి పుష్కలంగా నీరు త్రాగాలి.

**4.నివారణ టీకాలపై దృష్టి**

కొలెస్ట్రాల్ స్థాయిలు, పెద్దప్రేగు కాన్సర్, గుండె సమస్యలు మరియు మరిన్నింటికి సంబంధించిన ఆరోగ్య పరీక్షలు సహా మెడికేర్ కవరేజీకి అర్హత పొందడం వంటి నివారణ సంరక్షణ సందర్శనలు. ఇన్ఫ్లుఎంజా, న్యుమోనియాను నివారించడంలో సహాయపడే టీకాలు డాక్టరు సలహాపై వయోధికులు తీసుకోవాల్సి ఉంటుంది.

**5.మందుల నిర్వహణపై డాక్టర్ని సంప్రదించండి**

వయోధికులు ఔషధాల గురించి వారి వైద్యునితో అవసరమైనంత మేరకు తరచుగా సంప్రదించండి. ఔషధాలను మార్చడం లేదా ప్రారంభించిన తర్వాత ఎప్పటికప్పుడు ఔషధ పరస్పర చర్యలను పరిగణించి, ఏదైనా కొత్త లక్షణాలను గమనించండి (అలెర్జీ ప్రతిచర్యలు, మగత, ఆకలి లేకపోవడం వంటి గుణాలు).

**6.శరీరావసరానికి తగినంత నిద్ర**

తరచుగా నిద్ర లేవడం, రాత్రి నిద్రలేమి అనేది వయోధికులలో సర్వసాధారణం. నిద్రలేమిని తగ్గించడానికి లైట్లను ఆపివేయండి. వయోధికుల బెడ్‌రూమ్ సౌకర్యవంతంగా, చల్లగా, నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోండి. మధ్యాహ్నం వేళ అరగంట సేపు విశ్రాంతి తీసుకొవడం అవసరం.

**7. ప్రశాంత చిత్తంతో మానసిక ఆరోగ్యాన్ని పొందండి**

వయోధికులు రాత్రింపగళ్ళు టి.వి. ఛానల్స్‌లో నిరంతరంగా వార్తలు చూడడం, వివిధ నెట్ ప్రొవైడర్లు అందిస్తున్న హింసాత్మక డిజిటల్ సౌండ్‌తో ఉన్న సినిమాలు, సీరియల్స్ చూడటం అధికం కావడంతో తద్వారా కుటుంబ సభ్యులతో మసులుకోలేక చీటికి మాటికి అనవసరంగా తిట్టడం, అరవడం వంటి చేష్టలతో మానసికంగా అనారోగ్యం పాలవుతుంటారు. దీనితో రోజల్లా కూర్చోవడంతో వ్యాయామం లేక షుగరు, బిపి, గుండె జబ్బులకు గురవుతుంటారు. మానసిక ఆరోగ్య పరిపక్వతకు చదవడం, వ్రాయడం, సంగీతం వినడం, భక్తి ఆధ్యాత్మిక ప్రవచనాలు వినడం శ్రేయస్కరం. దానితో వారి మనస్సులను ఉత్తేజపరిచేందుకు దోహదపడుతుంది. కుటుంబంతో ఆహ్లాదంగా ఉండేందుకు చుట్టూ ఉన్న ప్రపంచంతో నిమగ్నమవ్వడానికి వీలు కుదరడంతో మానసిక ఆరోగ్యం చేకూరుతుంది.

**8.దృష్టి కోసం కళ్లజోడు - దంత సమస్యలకు దంతవైద్యుడి సహకారం**

కళ్లజోడు ధరించే వయోధికులు ప్రతి సంవత్సరం వారి కళ్లను పరీక్షలు చేయించుకోవాలి. దృష్టి లోపం మేరకు సరైన అద్దాలు కలిగి ఉండటం వల్ల వయోధికులు పడిపోయే అవకాశాన్ని తగ్గించవచ్చు. వయస్సుతో పాటు దంత సమస్యలు ఎదుర్కోవడం పరిపాటి. కావిటీస్ సమస్య వల్ల ప్రమాదం పెరుగుతుంది, తద్వారా నోటి ఇన్ఫెక్షన్లు మధుమేహం, గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు సంభవిస్తాయి. కాబట్టి వయోధికులు దంతవైద్యుడిని క్రమం తప్పకుండా ఆరునెలలకొకసారి చూపించుకోవడం అవసరం.

**9.కుటుంబంతో కలిసిమెలిసి**

కుటుంబంలోని అందరితో సామరస్యంగా మెలుగుతూ, మనుమలతో గడిపే సమయం వయోధికులకు ఆనందింప చేస్తుంది, తద్వారా వయోధికులను మరింత ఉత్సాహంగా మనుమలతో వారి ఆటపాటలతో పాల్గొనడం ద్వారా వారి వయస్సుకు దగ్గర చేస్తాయి, ఇది ఏ వయసులోని వారైనా వారికది అత్యుత్తమ ఔషధం.

**10.సోమరితనం వదిలితే శారీరకంగా చురుకుగా ఉత్సాహంగా**

వయోధికులం మేం, మాకు చాతకాదు, నేను చేయలేను అనే కుంటిసాకులు విడిచిపెట్టండి. మేము అన్ని చేయగలమన్న ధీమాతో, ఆత్మవిశ్వాసంతో ప్రతిరోజు వేకువనే లేవడం, స్వచ్ఛమైన గాలిలో ప్రశాంత చిత్తంతో వాకింగ్ (కాలినడక) చేయడం అత్యవసరం. ఇక తదుపరి వ్యాయామంతోపాటు, ప్రాణాయాయం, ధ్యానం వంటివి తప్పనిసరిగా చేసుకోవడం, వృద్ధులైన ప్రతి ఒక్కరికి అవసరం అని చెప్పకతప్పదు. ఈ విధంగా ప్రతి నిత్యం దృఢసంకల్పంతో దీక్షాదక్షతతో కంకణబద్ధులై శారీరక శ్రమ చేయడం వల్ల ఎలాంటి ఒత్తిడి (డిప్రెషన్) నుండైనా ఉపశమనం పొందగల్గుతారు. అంతేకాకుండా సామర్థ్యశక్తి, జ్ఞాపకశక్తి పెరగడం తద్వారా కౌమార యవ్వనప్రాయంలో ఉన్నటువంటి పట్టుదల, ప్రావీణ్యం, నైపుణ్యం వీరికున్న అనుభవం అన్నివిధాలుగా వయోధికులకు తోడవ్వడంతో ఏ పని చేపట్టినా ఓర్పుతో, నేర్పుతో మరింత సామర్థ్యం చూపించగలుగుతారు.

## వయోధికుల వేళలోనూ... టీకాలు

పుట్టినప్పటి పాపాయికి అనేక వ్యాధులు నుంచి రక్షణ కోసం నిర్ణీత వ్యవధిలో అనేక వ్యాక్సిన్లు ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా జీవితంలోని బాధ్యతలు ముగిసి... మలిసంజ వేళలోనూ... వార్థక్యంలోకి ప్రవేశించినప్పుడు కూడా, మరో బాల్యం అంటారు. ఎందుకంటే... పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎలా తగ్గుతుందో... పెద్దవాళ్ల వయసు మరింత పైబడుతున్న కొద్దీ వారిలోనూ రోగనిరోధక శక్తి తగ్గుతుంటుంది. అందుకే పుట్టినప్పటి పాపాయి లాగే వృద్ధాప్యంలో అడుగిడుతున్న వారికి టీకాల అవసరం ఉంటుంది. కానీ... ఉన్న ఆరోగ్యం ఎలాగూ బాగుంది... దీని కోసం మళ్లీ ఈ వయసులో టీకాలెందుకు అన్నది చాలామంది వృద్ధుల ఆలోచనాసరళి. వృద్ధాప్యంలో సమయానికి తీసుకోవాల్సిన టీకాలు వేయించుకోవడం లాభదాయకం. ఆ విషయంపై అవగాహన కల్పించడం అత్యవసరం. భారతదేశంలో, దేశవాసుల సగటు ఆయుఃప్రమాణం (లైఫ్ ఎక్స్‌పెక్టెన్సీ రేట్) 68.89 ఏళ్లు. అంటే దాదాపు 70 ఏళ్లు అనుకోవచ్చు. గత పదేళ్ల వ్యవధిలో ప్రజల ఆయుఃప్రమాణం ఐదు సంవత్సరాలు పెరిగింది. ఇలా ప్రజల ఆయుఃప్రమాణం పెరగడం అన్నది ఒక మంచి సూచికగా భావించినా... వృద్ధాప్యంలో వచ్చే న్యుమోనియా జబ్బుతో ఏటా మన దేశంలో రెండున్నర లక్షల మరణాలు సంభవిస్తున్నాయి. న్యుమోనియా వ్యాధికి బ్యాక్టీరియా, వైరస్, ఫంగల్ ఇన్ఫెక్షన్లలో ఏవైనా కారణం కావచ్చు. సాధారణంగా కౌమారం, యవ్వనం, యువకుల్లో, మధ్యవయస్కుల్లో అంత ప్రమాదకరం కాని న్యుమోనియా వృద్ధుల్లో చాలా ప్రమాదకరంగా పరిణమించడమే కాదు... ఒక్కోసారి ప్రాణాలనూ హరించవచ్చు. ఉదా: గత రెండేళ్ళుగా విజృంభించిన కరోనా మహమ్మారి (కోవిడ్-19) తో మరణించిన వారి సంఖ్యలో ఎక్కువ శాతం వృద్ధులు కావడం గమనార్హం.

## జీవిత పరమార్థం

వృద్ధులు గడచిన జీవితంలో ఉద్యోగం, వ్యాపారం వంటి అనేకానేక రంగాలలో బిజి బిజీగా గడిపిన వ్యవహారశైలి. తల్లిదండ్రుల బాధ్యత, వారి ఆరోగ్యసమస్యలు, పిల్లల ఆలనా పాలనా, విద్యాభ్యాసం, ఉద్యోగం, పెళ్ళిల్లు ఇలా ఒకదాని వెంట ఒకటి బండెడు బరువును మోస్తూ... కాలం గిర్రున తిరిగి వార్థక్యంలోకి అడుగుపెట్టడం, అది కోటీశ్వరుడైనా... సామాన్యుడైనా... నిరుపేదలైనా... ప్రతి ఒక్కరికీ సహజం. కోకిల పాటల ఆమని ఎంత సహజమో, పండుటాకుల శిశిరమూ అంతే సహజం. మల్లెపూవుల పొదలపై మధుప పంక్తులు వ్రాలుటెంత సహజమో, జీర్ణపత్రముల శ్లథశైశిరములూ అంతే సహజం. దేహమంటే పెరిగేది. శరీరమంటే క్షీణించేది. కౌమార యవ్వనాలే ఎన్నటికీ వుండిపోవు.

దేహినో అస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా... అని గీతలో ఒక శ్లోకం వుంది.

ఈ దేహంలో కౌమారం, యవ్వనం, వార్థక్యం ఎట్లాగైతే వున్నాయో... అని దేహంతరప్రాప్తి క్రమాన్ని వివరిస్తుంది... ఆ శ్లోకం.

చివురాకు ఎన్ని మిసమిసలున్నా, పండుటాకుగా మారక తప్పదు. వార్థక్యమూ అంతే. ఈ వార్థక్య దశలో జీవనశైలిని మార్చుకొని, మంచి అలవాట్లతో ఆయుఃప్రమాణాన్ని పెంచుకొని వయోధికులు ('వంద' సంవత్సరాలు) ఆరోగ్యంగా సునాయాసంగా జీవించవచ్చు. 'అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం' సందర్భంగా సోదర/సోదరీ మణులందరికీ 'వంద'నాలు.

సర్వేజనాః సుఖినోభవంతు!

*(అక్టోబర్ 1, 2021 అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం)*



-శారద శృంగేరి
సెల్: 9490261119







# హమ్మెల్, హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ ఐఎస్ఎల్ 2021-22 జెర్సీ కిట్‌ను ఆవిష్కరణ



హైదరాబాద్ , సెప్టెంబర్ 30: హైదరాబాద్ ఎఫ్‌సి 2021-22 సీజన్ కోసం తమ కొత్త అద్భుతమైన పసుపు మరియు నలుపురంగు హోమ్ కిట్‌ను విడుదల చేసింది,ఇది 1940-1960లో హైదరాబాద్ స్వర్ణ యుగానికి నివాళిగా ఉద్దేశపూర్వకంగా రూపొందించబడింది. క్లబ్ యొక్క నిజమైన అభిమానులతో కూడిన వీడియో ద్వారా జెర్సీని బహిర్గతం చేశారు.

ఈ అభిమానులు తమ అభిమాన క్లబ్ పట్ల గౌరవం మరియు ప్రేమలో ఏకం కావడానికి వివిధ రంగాల నుండి వచ్చి, హైదరాబాద్ నగరం అంతటా ఫుట్‌బాల్ ఆడుతున్నారు.హోమ్ కిట్‌ను పరిచయం చేయడంలో అభిమానులతో పాటు హైదరాబాద్ ఈఅ సహ యజమాని దృఢమైన వ్యక్తి రానా దగ్గుబాటితో కూడా వీడియో నిండిపోయింది. హమ్మెల్‌తో హైదరాబాద్ ఈఅ మొట్టమొదటిసారి భాగస్వామ్యమవుతూ కిట్ ను ఆవిష్కరించారు, హమ్మెల్, లెజెండరీ డానిష్ బ్రాండ్ గర్వించదగిన క్రీడా చరిత్రను కలిగి ఉంది మరియు గతంలో రియల్ మాడ్రిడ్, టోటెన్‌హామ్ హాట్‌స్పర్, ఆస్టన్ విల్లా, బెన్ఫికా మరియు డెన్మార్క్ జాతీయ జట్టు వంటి దిగ్గజ ఫుట్‌బాల్ జట్లు వీటిని ధరించేవి. నేడు, హమ్మెల్ హ్యాండ్‌బాల్ మరియు ఫుట్‌బాల్‌లోని క్లబ్‌లు మరియు ఆటగాళ్లను స్పాన్సర్ చేస్తూనే ఉంది, ఎవర్టన్, సౌతాంప్టన్ వాటిలో కొన్ని. హోమ్ కిట్ ఆన్‌లైన్‌లో హుమ్మెల్ వెబ్‌సైట్ www.hummel.net.inలో స్టోర్‌లో హుమ్మెల్, శరత్ సిటీ మాల్‌లో కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉంది. జెర్సీని ప్రారంభిస్తున్నప్పుడు క్లబ్ కోచ్ ఇలా అన్నాడు: "మా 2021-22 పసుపు మరియు నలుపురంగు కిట్‌ను ప్రారంభించడానికి మేము చాలా సంతోషిస్తున్నాము. ఈ కిట్ హైదరాబాద్ చరిత్రకు ఒక మనోహరమైన ప్రతిబింబం, మరియు ఇది చరిత్ర పునరావృతం చేయడానికి ఒక ప్రేరణగా నిరూపించబడుతుందని మేము ఆశిస్తున్నాము మరియు క్లబ్ అభిమానులందరిలో కూడా ఇది ప్రజాదరణ పొందింది. హైదరాబాద్ ఎఫ్‌సి సహ యజమాని వరుణ్ త్రిపురనేని ఇలా వ్యాఖ్యానించారు,"న్యూజెర్సీ లాంచ్ వీడియోని మీ ముందుకు తీసుకురావడానికి మేము సంతోషిస్తున్నాము.నగరం మాకు భారత ఫుట్‌బాల్ స్వర్ణ యుగాన్ని అందిచ్చింది మరియు ఇప్పుడు తిరిగి చెల్లించే సమయం ఆసన్నమైంది.క్లబ్ యొక్క నమ్మకమైన అభిమానులచే ప్రతిఒక్కరికి జెర్సీని బహుకరించడం కంటే మెరుగైన మార్గం మరొకటి లేదు.మా నూతన జెర్సీ కిట్ ఆవిష్కరణతో,ఒకప్పుడు యువత ప్రతిభతో మరియు మైదానంలో డైనమిక్ డిస్‌ప్లేతో నగరం నుండి బయటకు వచ్చినా కూడా అదే అభిరుచితో ఈ ప్రాంతాన్ని మళ్లీ రగిలించడానికి మేము సిద్ధంగా ఉన్నాము. కిట్ ఆవిష్కరణలో మాట్లాడుతూ, హమ్మల్ ఇండియా, లీడ్ డొమెస్టిక్ సేల్స్, అజింక్యా కాలే ఇలా తన భావాలను వెలిబుచ్చారు," ఊఈఅ జెర్సీని

# ఏపీలో వెయ్యి దాటిన కరోనా కేసులు.. పెరిగిన రికవరీ రేటు

అమరావతి, , సెప్టెంబర్ 30:ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు స్థిరంగా కొనసాగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 58,054 మంది సాంపిల్స్ పరీక్షించగా.. 1,010 మందికి పాజిటివ్ నిర్ధారణ అయింది. అదే సమయంలో 1149 మంది కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకుని ఆరోగ్యవంతులు అయ్యారు. మరో 13 మంది చనిపోయారు. రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 2050324కి చేరగా.. ఇందులో 2024645 మంది ఆరోగ్యవంతులు అయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11,503 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు కరోనాతో 14,176 మంది ప్రాణాలు కోల్పోయారు.

# మరో నాలుగు కేటగిరీల్లో 'యాంత్ర' సేవలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 30: ప్రముఖ స్మార్ట్ ఫోన్ మరమ్మతులలలో అగ్ర స్థానం ఉన్న యాంత్ర తమ సేవలను నగరానికికి విస్తరించినట్లు జయంత్ ఝా, వ్యవస్థాపకుడు మరియు సిఇఒ తాము విడుదల చేసిన ప్రకటనలలో తెలిపారు.

హైదరాబాద్‌లో తన పోర్ట్‌ఫోలియోను 4 కేటగిరిల్లో ఆవిష్కరించారు. యంత్ర సరసమైన ధరల్లో, డిమాండ్‌పై మరమ్మతుల సేవలను స్మార్ట్‌ఫోనులు కాకుండ అన్ని బ్రాండ్ల ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, టివిలు, స్మార్ట్ వేరబుల్స్‌నకు విస్తరించింది. మరమ్మతు సేవలు రూ.99 కనిష్ట ధరలో మొదలువుతాయి. యాంత్ర సమా జయంత్ ఝా, వ్యవస్థాపకుడు మరియు సిఇఒ నగర విస్తరణపై వ్యాఖ్యానిస్తూ, వేంగా, సౌకర్యంగా, నమ్మకంగా, సరసమైన ధరల్లో డిమాండ్‌పై ఇంటి వద్దే మరమ్మతు సేవలు అందిచడం యాంత్రలో తమ లక్ష్యమని తెలిపారు.

# బద్వేల్‌లో పోటీ చేయనున్న జనసేన

అమరావతి, , సెప్టెంబర్ 30:అక్టోబర్ 30న కడప జిల్లాలోని బద్వేల్‌కు ఉప ఎన్నిక జరగబోతున్న సంగతి తెలిసిందే. ఈ ఉప ఎన్నికల్లో జనసేన పార్టీ బద్వేల్ నియోజక వర్గం నుంచి పోటీ చేయబోతున్నట్లు సమాచారం. తిరుపతి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసిన కారణంగా ఈసారి బద్వేల్ నియోజక వర్గంలో పోటీ చేసే అవకాశం జనసేనకు ఇచ్చినట్టు బీజేపీ నేతలు చెబుతున్నారు.అయితే జనసేన నుంచి ఎవరు పోటీలో ఉంటారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. బద్వేలు ఉప ఎన్నికతో పాటుగా రాష్ట్రంలోని తాజా పరిణామాలపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. అక్టోబర్ 2 వ తేదీన జనసేన పార్టీ తలపెట్టిన శ్రమదానం కార్యక్రమం వివరాలను సోము వీర్రాజుకు పవన్ వివరించారు. అటు అక్టోబర్ 7న నెల్లూరులో బీజేపీ మత్స్య గర్జన కార్యక్రమం చేపట్టబోతున్న సంగతి తెలిసిందే. ఈ మత్స్య గర్జన కార్యక్రమం వివరాలను పవన్‌కు సోము వీర్రాజు వివరించారు.

# బతుకమ్మ సంబురం.. అక్టోబర్ 2 నుంచి ఆడబిడ్డలకు సర్కార్ కానుక..

హైదరాబాద్ , సెప్టెంబర్ 30:తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే బతుకమ్మ పండుగ రానే వచ్చింది. తెలంగాణ ఆడబిడ్డలు తారతమ్య బేధం లేకుండా సంబురంగా జరుపుకునే పండుగ ఇది.. పండుగ పూట ఏ ఆడబిడ్డ ముఖం చిన్నబొవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఏడాది పెద్ద మనసుతో ఆడబిడ్డలకు సారెలను కానుకగా అందిస్తోంది. ఈ క్రమంలో అక్టోబర్ 2వ తేదీ నుంచి బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ఈ సంవత్సరం 30 సరికొత్త డిజైన్లను రూపొందించి వాటిని 20 విభిన్న రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు.

# యాదాద్రీశుడికి ప్రత్యేకపూజలు



యాదాద్రి, సెప్టెంబర్ 30:: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామి అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. తులసీ దళాలతో అర్చించి అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఆలయ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణ మహోత్సవం జరిపించారు.

కొండపైన ఉన్న పర్వతవర్ధనీ రామలింగేశ్వరుడికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవిని కొలుస్తూ కుంకుమార్చన జరిపారు. కొండ కింద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి సంకల్పంలో పాల్గొన్నారు. రాత్రి బాలాలయంలోని ప్రతిష్ఠమూర్తులకు ఆరాధన, సహస్రనామార్చన జరిగాయి. యాదాద్రి ఆలయంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుపుకునే సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజల్లో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

నేడు యాదాద్రికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు నేడు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్వామి వారిని దర్శించుకున్ని ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు.

# 25 వ సారి రక్త దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న గాలిపెల్లి కుమార్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఏడవెల్లి శైలజ ఆసుపత్రి లో ఉన్న గర్భిణీశ్రీ రిజ్వాని గారికి అత్యవసరంగా ఎ పాజిటివ్ రక్తం అవసరం కావటంతో వారి బంధువులు కావాలని గాలిపెల్లి కుమా ర్ కి సమాచారం ఇవ్వగ స్పందించిన కుమార్ అతనే నేరుగా వెళ్లి జీవనాధార బ్లడ్ బ్యాంకులో ఎ పాజిటివ్ రక్తదానం చేయడం జరిగింది.అనంతరం పేషంట్ కుటుంబానికి ధైర్యాన్ని అందించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ బ్లడ్ మరియు రక్తకణాలు ఎవరికీ అవసరం ఉన్న ముందుకు వచ్చి ఇవ్వడానికి సిద్ధం గా ఉన్న,25 వ సారి రక్తదానం చేయడం చాలా ఆనందం గా ఉంది అని అన్నారు, రక్తదానం చేసిన కుమార్ ను యువకులు పేషంట్ కుటుంబ సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

# హుస్నాబాద్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ

హైదరాబాద్ , సెప్టెంబర్ 30:హుజురాబాద్ ఉపఎన్నికలో గెలుపే లక్ష్యంగా బీజేపీ దూసుకుపోతోంది. ఉపఎన్నిక షెడ్యూల్ వెలువడటంతో బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభను భారీగా నిర్వహించాలని కాషాయ దళం నిర్ణయించింది. ఈ క్రమంలో అక్టోబర్ 2న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ముందుగా హుజూరాబాద్‌లో ముగింపు సభ నిర్వహించాలనుకున్నా.. షెడ్యూల్ వెలువడటంతో హుస్నాబాద్ కు మార్చారు.

ఏడేళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన పాదయాత్ర తుది దశకు చేరుకుంది.

పాదయాత్ర ముగింపు సందర్భంగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీతో కలిసి బండిసంజయ్ రోడ్ షో నిర్వహించనున్నారు. అనంతరం బహిరంగ సభలో ?పాల్గొంటారు. తొలిదశ పాదయాత్ర విజయవంతంపై ప్రజలకు బండి సంజయ్? కృతజ్ఞతలు తెలపనున్నారు. హుస్నాబాద్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేసి తమ సత్తా చాటాలని కమల దళం ప్రణాళిక రచిస్తోంది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.